రేపు కొవ్వలి జడ్పీ హైస్కూలులో జిల్లా స్థాయి సైన్సు ప్రదర్శన

ఏలూరు అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఈ నెల 4న ఉదయం 9గంటల నుంచి దెందులూరు మండలం, కొవ్వలి జడ్పీ హైస్కూలు ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రి కె.పార్థసారథి, జడ్పీ చైర్‌పర్సన్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ హాజరవుతారని వివరించారు.



న్యూ ఇయర్ కిక్కు

- జిల్లాలో రెండు రోజుల్లో రూ.13 కోట్ల విలువైన మద్యం తాగేశారు

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లాలో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. జిల్లాలోని డిసెంబరు 31, జనవరి 1న కలపి రెండు రోజుల్లోనే రూ.13 కోట్ల మద్యాన్ని మద్యం ప్రియులు తాగేశారు. జిల్లాలో 144 మద్యం షాపులు, 15 బార్‌లు ఉన్నాయి. 2023 డిసెంబరు 31న రూ.ఆరు కోట్ల విలువైన మద్యాన్ని జిల్లాలో విక్రయించగా 2024 డిసెంబరు 31న రూ.ఏడు కోట్ల విలువైన మద్యాన్ని విక్రయించారు. గతేడాది జనవరి 1న రూ.ఆరున్నర కోట్ల మద్యం విక్రయించగా, ఈ ఏడాది జనవరి 1న ఏడున్నర కోట్ల మద్యాన్ని విక్రయించారు. గతేడాది 140 ప్రభుత్వ మద్యం షాపులు, వాకింగ్ స్టోర్స్ 12, బార్లు 16 ఉండేవి. జిల్లాలో 2023 డిసెంబరు మొత్తం రూ.వంద కోట్ల 11 లక్షల మద్యాన్ని విక్రయించగా 2024 డిసెంబరులో రూ.110 కోట్ల 75 లక్షల విలువైన మద్యాన్ని విక్రయించారు. మద్యం ధరలు తగ్గించడం అమ్మకాల పెరుగుదలకు ఒక కారణంగా చెబుతున్నారు.

దివ్యాంగులకు.. శుభవార్త!



దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారు ఉపయోగించే మూడు చక్రాల వాహనాలకు పెట్రోల్, డీజిల్‌పై 50 శాతం రాయితీ ప్రకటించింది. గత వైసీపీ ప్రభుత్వం నామమాత్రంగా ఈ పథకాన్ని మార్చగా కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఊతమిచ్చేలా పథకాన్ని మార్పు చేయాలని భావించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి ఒక్కో జిల్లాకు రూ.లక్ష చొప్పున నిధులను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది.

మూడు చక్రాల వాహనాలకు పెట్రోలు రాయితీ

- వాహన సామర్థ్యాన్ని బట్టి సబ్సిడీ
- దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

ఏలూరు రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి వారికి మేలు చేకూర్చేలా మూడు చక్రాల వాహనాలకు పెట్రోల్, డీజిల్‌పై రాయితీ ప్రకటించడం, నిధులు విడుదల చేయడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 29,632 మంది దివ్యాంగులు ఉన్నారు. ఇందులో చాలామంది స్వయం ఉపాధితో పాటు ప్రైవేట్ సంస్థల్లో పని చేసే వారు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనాలను వాడుతున్నారు. వీరికి రాయితీపై పెట్రోల్, డీజిల్‌ను అందించనున్నారు. వీరి వాహనాలకు వినియోగించే పెట్రోల్ ఖర్చులో 50 శాతం రాయితీపై రీయింబర్స్ చేయనున్నారు. ఈ నగదును లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారు. దీనికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేశారు. లబ్ధిదారుడు ఇంటి నుంచి పనిచేసే స్థలానికి, పనిచేసిన చోటు నుంచి ఇంటికి చేరే దూరాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు. రెండు హార్స్ పవర్ ఇంజన్ సామర్థ్యం ఉన్న వాహనాలకు నెలకు 15 లీటర్లు, రెండు హార్స్ పవర్‌కంటే గరిష్ఠంగా ఇంజన్ సామర్థ్యం ఉన్న వాహనాలకు 25 లీటర్ల పెట్రోల్‌ను రాయితీపై అందిస్తారు. కొనుగోలుకు సంబంధించి రశీదులు జత చేస్తే రాయితీ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఈ పథకానికి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారు మాత్రమే అర్హులు. స్వయం ఉపాధితో పాటు ప్రైవేట్ సంస్థలో పనిచేసి ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగాలు చేసే వారికి ఈ పథకం వర్తించదు. దరఖాస్తుతో పాటు సదరం ధ్రువపత్రం, పెట్రోల్ బిల్లులు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం, మొదటి పేజీ బ్యాంకు పాస్ పుస్తకం, వైకల్యం కనిపించేలా పాస్‌పోర్టు సైజు ఫొటో, ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తున్నట్టు ధ్రువపత్రాలు జిరాక్స్‌లు సమర్పించాలి. దరఖాస్తులను కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న విభిన్న ప్రతిభావంతుల శాఖ కార్యాలయంలో అందించాలి.

> గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం పక్కాగా అమలు చేశారు. కాని వైసీపీ వచ్చిన తర్వాత ఈ పథకానికి గ్రహణం పట్టింది. అరకొర కేటాయింపులు చేసి నామమాత్రంగా అమలు చేశారు. 2023-24లో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్నిజిల్లాలకు కేటాయించింది కేవలం రూ.ఐదు లక్షలు మాత్రమే. అందులో ఖర్చుచేసిన నిధులు అక్షరాలా 2లక్షల96 వేలు మాత్రమే. అంటే పథకాన్ని ఎంత చిత్తశుద్ధిగా అమలు చేశారో అర్థం చేసుకోవచ్చు.

అర్హులు దరఖాస్తు చేసుకోండి..

దివ్యాంగుల మూడుచక్రాల వాహనాలకు పెట్రోల్, డీజిల్‌ను ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనాలను వినియోగిస్తూ ఉండాలి. అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చు. సమాచారానికి కార్యాలయంలో లేదా 08812 234146 నంబరులో సంప్రదించాలి.

- బి.రామ్‌కుమార్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ

రేపటి నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

ఏలూరు అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలును ఒకరోజు వాయిదా వేశారు. తాజా ఉత్తర్వుల మేరకు భోజన పథకాన్ని శనివారం నుంచి అమలు చేయనున్నట్టు జిల్లా విద్యాశాఖవర్గాలు వెల్లడించాయి. తొలుత ఈ నెల ఒకటో తేదీ నుంచి ఈ పథకాన్ని అమలు చేయాల్సి ఉండగా, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాప సూచకంగా ఏడురోజుల పాటు అన్ని అధికారిక కార్యక్రమాలను వాయిదా వేసిన విషయం విదితమే. సంతాప దినాలు ఈనెల ఒకటో తేదీతో ముగిసిన నేపథ్యంలో భోజన పథకాన్ని 3వ తేదీ నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే ఈ పథకాన్ని అధికారికంగా విద్యాశాఖ మంత్రి లోకేశ్ శనివారం మచిలీపట్నంలో ప్రారంభించడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా అదేరోజు నుంచి అమలు చేసేందుకు వీలుగా వాయిదా వేసినట్టు విద్యాశాఖ వర్గాలు వివరించాయి. జిల్లాలోని 19 జూనియర్ కళాశాలల్లో భోజన పథకాన్ని వినియోగించుకునే విద్యార్థుల సంఖ్య గురువారం ఖరారైంది. ఆ ప్రకారం మొత్తం 3,248 మంది ఇంటర్ విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతుండగా, వీరిలో డే స్కాలర్లు, హాస్టల్ విద్యార్థులు కలిపి మొత్తం 2,640 మంది మధ్యాహ్న భోజనాన్ని కళాశాలలోనే తీసుకునేందుకు అంగీకారం తెలిపారని అధికార వర్గాలు వివరించాయి. వీరికి ఆహార పదార్థాలను తయారు చేసేందుకు వంట కార్మికులకు ఇచ్చే బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలను ఇప్పటికే చేరవేశారు. భోజనం ప్లేట్లు, గ్లాసులను కళాశాలల ప్రిన్సిపాళ్లే సమకూర్చాల్సి ఉంటుంది. హైస్కూల్ విద్యార్థులకు అమలు చేస్తున్న మెనూనే ఇంటర్ విద్యార్థులకు వర్తింపజేస్తారు. ఆహార పదార్థాల తయారీ నిమిత్తం అదనంగా 39 మంది వంట కార్మికులను విద్యాశాఖ ఇప్పటికే నియమించింది.

ఉప్పుటేరుపై ఆక్రమణలు తొలగించండి

కైకలూరు సమీక్షలో డిప్యూటీ స్పీకర్ రఘురామ, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని

కైకలూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి):కొల్లేరు వరద ముంపును తొలగించేందుకు ఉప్పుటేరుపై ఉన్న ఆక్రమణలను తొలగించి వెడల్పు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ కె.రఘురామ కృష్ణరాజు, కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశించారు. కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ అభివృద్ధి పనులపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్షించారు. రఘురామ మాట్లాడుతూ 'ఉప్పుటేరు వెంబడి ఉన్న ఆక్రమణలతోనే ముంపు పొంచి ఉంది. ఆక్రమణలను తొలగించడమే శాశ్వత పరిష్కారం. ఆ దిశగా చర్యలు చేపట్టాలి' అని ఆదేశించారు. నియోజకవర్గంలో రీసర్వేలో జరిగిన తప్పుల సవరణకు ఇతర భూసమస్యల పరిష్కారానికి కైకలూరులోని తన కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రకటించారు. నియోజకవర్గంలో 165 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రహదారుల నిర్మాణానికి, నిలిచిన అంగన్వాడీ కేంద్రాలు, హెల్త్‌క్లినిక్‌ల పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు. నియోజకవర్గంలో అనేక సమస్యలపై ప్రతీ సోమవారం ఫిర్యాదులు అందుతున్నాయని, వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. నియోజకవర్గ గ్రామాల్లోని ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులకు రూ.10 కోట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, డీపీవో అనురాధ, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ మోషే, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ త్రినాథబాబు, పంచాయతీ రాజ్ ఎస్ఈ రమణమూర్తి, డ్వామా పీడీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. కాగా గ్రామ సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, ఆమె భర్త దానం ప్రసాద్ కొంత కాలంగా తమను వేధిస్తున్నట్టు కైకలూరు పంచాయతీ సిబ్బంది కలెక్టర్ వెట్రిసెల్వికి ఫిర్యాదుచేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని కలెక్టర్ డీపీవో అనురాధను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు.. చిత్రంలో ఎమ్మెల్యే కామినేని, కలెక్టర్ వెట్రిసెల్వి

పానీ పాట్లు

గ్రామాల్లో తాగునీటి వెతలు | రక్షిత నీటి పథకాలపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం | శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌లు | మరమ్మతులకు నోచుకోని ఫిల్టర్ బెడ్‌లు

-6లో



సమీక్షలో మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ బొరగం

వైటీసీని తెరిపిస్తాం.. ఉపాధి కల్పిస్తాం

ట్రైకార్ చైర్మన్ బొరగం

బుట్టాయగూడెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ఏజెన్సీలోని గిరిజన యువతీ యువకులకు ప్రత్యేక శిక్షణలు ఇస్తూ ఉపాధి అవకాశాలను కల్పించే యువత శిక్షణ కేంద్రం (యూత్ ట్రైనింగ్ సెంటర్) మూతపడి ఉండడానికి వీల్లేదని, దానిని తెరిపించి గిరిజన యువతకు ఉపాధిని కల్పిస్తామని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. కేఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయంలో గురువారం అన్ని శాఖల అధికారులతో ఆయనతో పాటు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జేసీ ధాత్రిరెడ్డి సమీక్ష నిర్వహించారు. బొరగం మాట్లాడుతూ వైటీసీని తిరిగి తెరిపించడానికి అవసరమైన నిధుల విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి నిధుల విడుదలకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం వైటీసీలను నిర్వీర్యం చేసి పాడుబడిన భవనాలుగా మార్చివేయడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ వైసీపీ పాలనలో వైటీసీ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందన్నారు. జేసీ, ఐటీడీఏ పీవో పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తుల అమ్మకాలకు వనసిరి అనే పథకాన్ని తీసుకొస్తున్నామన్నారు. ట్రైకార్ ద్వారా గిరిజన యువతకు వాహన యూనిట్లను అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ట్రైకార్ డైరెక్టర్ జె.కృష్ణారావు, జీసీసీ డైరెక్టర్ మడకం కన్నపరాజు, ఏపీవో పీవీఎస్ నాయుడు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా పాలకుంట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను జేసీ ధాత్రిరెడ్డి సందర్శించారు. పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఐటీడీఏ పీవో ఛాంబర్‌లో గురువారం జేసీ పి.ధాత్రిరెడ్డి నిర్వహించిన గ్రీవెన్స్‌కు గిరిజనులు, గిరిజనేతరులు వినతులు సమర్పించారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

చిలుక.. అలుక..

అలకలు.. కోపాలు మనుషులకే కాదు.. పక్షుల్లకూ కూడా ఉంటాయేమో..!ఆకివీడు -ఉండి మార్గంలో రామచిలుకల జంట హావభావాలు చూస్తే అలానే అనిపించింది.. ఈ చిత్రాలకు సరదా సంభాషణలు...


మ్..మ్... నేను అలిగాను..!


నీకు వేరే పనేముంది.. ఎప్పుడూ ఉండేదేగా..


ఇప్పుడు నేను ఏమన్నానని.. అలా మూతి ముడిచావ్ !


సరి.. సర్లే.. ఇంకెప్పుడూ ఏమీ అనునులే..


సాయంత్రం షికారు వెళదామా..!


లవ్ యూ రా.. సారీ రా..

ఆంధ్రజ్యోతి పరిశీలన

గ్రామాల్లో తాగునీటి పథకాలు వెక్కిరిస్తున్నాయి.. గత వైసీపీ ప్రభుత్వం తాగునీటి సరఫరా వ్యవస్థలను నిర్లక్ష్యం చేయడంతో ప్రజలకు రక్షితనీరు కరువైంది... చాలాచోట్ల వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి.. ఏళ్ల తరబడి ఫిల్టర్ బెడ్‌లకు మరమ్మతులు లేక చెరువునీరే నేరుగా సరఫరా చేసే పరిస్థితులు నెలకొన్నాయి.. చెరువులకు తాగునీటిని సరఫరా చేసే కాల్వలు చెత్తా చెదారాలతో కలుషితమైపోయాయి.. దీంతో ఆ.. నీరే దిక్కవుతోంది. వచ్చేది వేసవికాలం.. గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది..పలు గ్రామాల్లో తాగునీటి పథకాల పనితీరును ఆంధ్రజ్యోతి పరిశీలించింది...

పానీ పాట్లు

గ్రామాల్లో తాగునీటి వెతలు

రక్షిత నీటి పథకాలపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం

శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌లు

మరమ్మతులకు నోచుకోని ఫిల్టర్ బెడ్‌లు

కలుషితమైన తాగునీటి కాల్వలు, చెరువులు



కైకలూరు మండలం ఆటపాకలో మంచినీటి చెరువు... కలిదిండి మండలం మూలలంకలో ఫిల్టర్‌బెడ్స్‌లో మొక్కలు

మొరాయించిన తాగునీటి పథకాలు

ఐదేళ్లుగా మరమ్మతులు లేవు
పలు గ్రామాల్లో పనిచేయని ఫిల్టర్‌బెడ్స్

కైకలూరు : గ్రామాల్లో ప్రజలకు తాగేందుకు గుక్కెడు నీరు లేక అల్లాడుతున్నారు. గత ప్రభుత్వం గ్రామాలకు నిధులు కేటాయించక పోవడంతో రక్షిత మంచినీటి పథకాలను గాలికొదిలేశారు. చాలా గ్రామాల్లో చెరువుల్లో నీరు నేరుగా పైపులైన్ల ద్వారా ఇళ్లకు అందిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పథకాల సామర్థ్యం పెరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఫిల్టర్‌బెడ్లు పనిచేయకపోవడంతో వాటర్ ట్యాంకుల్లో గడ్డి, కిక్కిస, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కైకలూరు నియోజకవర్గంలో 110 గ్రామాలు ఉండగా సగం గ్రామాల్లో పథకాలు పనిచేయని పరిస్థితి. దీంతో ప్రజలు ప్రైవేటు ఆర్వో ప్లాంట్‌లను ఆశ్రయిస్తున్నారు. కలిదిండి మండలం మూలలకం, భాస్కరరావుపేట గ్రామాలకు ఒకటే రక్షితమంచినీటి పథకం నుంచి నీరు సరఫరా అవుతుంది. ఫిల్టర్‌బెడ్స్ పనిచేయకపోవడం, చెరువుల సామర్థ్యం మేరకు నీరు లేకపోవడంతో రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తున్నారు. శీతాకాలంలోనే ఇలా ఉంటే రానున్న వేసవిలో తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. కైకలూరు మండలంలో మేజర్ పంచాయతీ అయిన ఆటపాక గ్రామంలో సుమారు 8 వేల మంది జనాభా ఉన్నారు. ఏడు ఎకరాల మంచినీటి చెరువు ఉండడంతో మార్చి నెల నుంచి రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తుంటారు. ఫిల్టర్‌బెడ్స్ సంవత్సర కాలంగా పనిచేయక పోవడంతో నేరుగా చెరువులోని నీటినే సరఫరా చేస్తున్నారు. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులో 4 వేల మంది జనాభా ఉన్నారు. నాంది ఫౌండేషన్ ద్వారా ఆర్వో సిస్టమ్‌ను ప్రారంభించి పంచా యతీకి అప్పగించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఐదేళ్ళుగా మరుగున పడింది. మండవల్లి మండలం పెనుమాకలంకలో రక్షితమంచినీటి పథకానికి చెందిన ఓవర్ హెడ్‌ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. దీంతో నీటిని నింపేందుకు పంచాయతీ అధికారులు భయపడుతున్నారు. ఇటీవల ఓవర్‌హెడ్ ట్యాంక్ నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక నిపుణుల బృందం వచ్చి తనిఖీలు చేసింది. అయితే ఆ నివేదిక రాక పోవడంతో ప్రస్తుతం గ్రామంలోని ప్రజలు నీటి ఇబ్బందులను ఎదుర్కొం టున్నారు. చాలా గ్రామాల్లో ఫిల్టర్‌బెడ్స్ పనిచేయకపోవడంతో చెరువుల నుంచి నేరుగా గృహాలకు నీటి సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభు త్వమైనా మంచినీటి చెరువుల దుస్థితిని గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుకుంటున్నారు.



ద్వారకాతిరుమల శివాలయం వీధిలో కొత్తగా నిర్మిస్తున్న మంచినీటిబోరు.. ఓ ఇంట్లో కుళాయి ద్వారా వస్తున్న బురదనీరు

ద్వారకాతిరుమలలో స్వచ్ఛనీరు కరువు

ద్వారకాతిరుమల : మేజర్ పంచాయతీ ద్వారకాతిరుమలలో ప్రజ లకు చాలా ప్రాంతాల్లో సురక్షిత తాగునీరు అందడం లేదు.ఈ పంచాయ తీలో ఐదు వేలకు పైగా జనాభా ఉండగా ఉన్న నాలుగు ట్యాంక్ లలో రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. కొండపైన ఉన్న పెద్ద ట్యాంకు రెండు లక్షల లీటర్ల కెపాసిటీ కాగా సంతమార్కెట్ వద్ద ఉన్నది 60 వేలు సామ్యం కలిగి బాగానే పనిచేస్తున్నాయి. దేవస్థానం నిర్మించిన వసంతనగర్ కాలనీలో ఉన్న 60 వేల కెపాసిటీ ట్యాంకు ఎగువన ఉండటం వల్ల నీరు ఎక్కడం లేదని నిలిపివేశారు.

వాల్వ్ వేయించండి ప్రభూ..



యాదవ కాలనీలో మంచినీరు సక్ర మంగా అందడం లేదు. పాత కాల నీకి సరిపడా నీరు అందిన తర్వాత వాల్వ్ కట్టక పోవడమే ఇందుకు కారణం. వాల్వ్ పాడై నెలలు గడుస్తున్నా పంచాయితీ వేయించడం లేదు. కొత్త వాల్వ్ వేస్తే నీరు మాకు తగినంతగా వస్తుంది. వాల్వ్ పోయిందని చెప్పినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

పెద్దిరెడ్డి త్రిమూర్తులు,యాదవ్ కాలనీ, ద్వారకాతిరుమల



పిప్పర పంట కాల్వ వద్ద నిరుపయోగంగా పంపింగ్‌హౌస్.. మోటార్లు

కోట్ల రూపాయల పథకాలు నిరుపయోగం

గణపవరం : గణపవరం మండలంలోని పిప్పర దిగువ గ్రామాలకు, ఎగువ గ్రామాలకు వెరసి 25 గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు లేక అలమటిస్తున్నారు. పిప్పరలోని ఉండి పంటకాల్వ గట్టుపై 3.5 కోట్ల రూపాయలతో జాతీయ గ్రామీణ తాగునీటి పథకం కింద 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల రక్షితనీటి పథకాన్ని 11 గ్రామాలకు అందించేలా నిర్మాణం చేపట్టారు. 3.5కోట్లతో 10 లక్షల లీటర్లు రోజుకు సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకును ఏ.గోపవరం గ్రామం వద్ద నిర్మించారు. పంపుహౌస్‌లు కూడా నిర్మించారు. 2017లో ఈ తాగునీటి ప్రాజెక్టును ప్రారంభించారు. ఉండి పంట కాల్వపై పంపింగ్‌హౌస్ మోటర్లు మరమ్మ తుల కారణంగా నిలిచిపోయాయి. పైపులైన్లు కూడా దెబ్బతిన్నాయి. ఇంతవరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో స్వచ్ఛమైన తాగునీరందక ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారు. కోట్లాది రూపాయలతో చేపట్టిన ఈ మంచినీటి పథకం నిరుపయోగంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. నూతన టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పైపులైన్‌లు, మోటార్లకు మరమ్మతులు చేయించి తాగునీటి చెరువుల్ని నింపుతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్ తెలిపారు.

• పిప్పర పంప్‌హౌస్ పునరుద్ధరించాలి



తాగునీటి సరఫరా పథకం మూలనపడటంతో స్వచ్ఛమైన తాగునీరు లభించడం లేదు. చెరువులకు వచ్చేనీటిలో వ్యర్థాలు కొట్టుకురావడంతో ఇబ్బందులు పడ్డాం. పిప్పర వద్ద నిర్మించిన తాగునీటి పథకం ద్వారా తమ గ్రామాల ద్వారా కొంత కాలం మంచినీరు లభించింది. ఈ పథకం నిలిచిపోవడంతో స్వచ్ఛమైన తాగునీటి కొరత ఎదుర్కుంటున్నాం. ఆ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలి.

-కానుమిల్లి చంటి, మొయ్యేరు


కొవ్వలి గ్రామంలోని పైలట్ తాగునీటి ప్రాజెక్టు

ఫిల్టర్ బెడ్‌లకు మోక్షం ఎప్పుడు ?

పది గ్రామాల్లో శిథిలమైన వాటర్ ట్యాంకులు

దెందులూరు : గత వైసీపీ ప్రభుత్వం తాగునీటి వ్యవస్థను తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది. దీంతో చాలా గ్రామాల్లో కలుషిత నీరే సరఫర అవుతోంది. దెందులూరు మండలంలోని 10 గ్రామాల్లో సురక్షిత నీరు అందే పరిస్థితి లేదు. మేజర్ గ్రామమైన కొవ్వలిలో ఉన్న పైలట్ ప్రాజెక్టు గత ఐదేళ్లలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. గత టీడీపీ ప్రభుత్వంలో దెందులూరు, అలుగులగూడెం, ఉప్పుగూడెం, సానిగూడెం, సత్యనారాయణ పురం, కొమ్మిరేపల్లి, సీతంపేట, పోతునూరు, ఉండ్రాజవరం, కొవ్వలి, దోసపాడు గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందేది. తాగునీరును శుద్ధిచేసే మైక్రో ఫిల్టర్ బెడ్‌లను 2016లో మార్చారు. 2021లో మార్చాల్సి ఉన్నప్పటికి వైసీపీ ప్రభుత్వం మార్చలేదు. దీనికి తోడు రైల్వే గేటు సమీపంలో అండర్ పాస్ పనుల గురించి పోతునూరు, కొవ్వలి, దెందులూరు, దోసపాడు మినహా మిగిలిన గ్రామాలకు పైలెట్ ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా నిలుపుదల చేశారు. అండర్ పాస్ బ్రిడ్జి పనులు పూర్తయి నప్పటికీ నీరు అందడం లేదు. మండలంలో చల్లచింతలపూడి జోగన్నపాలెం,పోతునూరు, దోసపాడు ఉండ్రాజవరం, వీరభద్రపురం, అక్కి రెడ్డి గూడెం, కొవ్వలి, గోపన్నపాలెం గ్రామాల్లోని వాటర్ ట్యాంక్‌లు పాడై శిథిలస్థితికి చేరాయి. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు,

• సమస్య పరిష్కరిస్తాం



కొవ్వలిలోని పైలెట్ ప్రాజెక్టులో మైక్రోఫిల్టర్ బెడ్‌లు మార్చేందుకు ప్రతి పాదనలు పంపాం. త్వరలో సమస్య పరిష్కరిస్తాం. మండలం లోని పది గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లు పాడయ్యాయి. వాటిని అమృతధార పథకం ద్వారా త్వరలో నూతన వాటర్ ట్యాంకుల నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

చింతమనేని వర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, దెందులూరు

అలాగే ఎస్సీ కాలనీలో ఉన్నమరో ట్యాంక్ నిరుపయోగంగా ఉంది. వారు డైరెక్ట్ పంపింగ్ విధానంతో మంచినీరును వినియోగించుకుంటున్నారు. అలాగే గ్రామ అవసరాలకు 9 బోర్లు ఉన్నాయి. ఇందులో చాలా ప్రాంతాలకు మంచినీరు వెళ్లే ఓ బోరు మరమ్మతులకు గురి కాగా దీనికి మారుగా మరో బోరును నూతనంగా నిర్మిస్తున్నారు. మరమ్మ తులకు గురైన బోరునుంచి వచ్చేనీరు సురక్షితంగా ఉండటం లేదు, బురదతో నలకలు వస్తున్నాయని స్థానికులు అంటున్నారు. కొత్తబోరు అందుబాటులోకి వచ్చేవరకూ ఈ పరిస్థితి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఆచంటలో రెండు వాటర్ ట్యాంక్‌లు అవసరం



ఆచంట: గతంలోనే ఆచంటతో పాటు పలు గ్రామాలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం ఏర్పాటు చేసి గత కొన్ని సంవత్సరాలుగా కుళాయిలు ద్వారా ప్రజలకు నీరు సరఫరా చేస్తున్నారు. అయితే ఈ పథకంకు సంబంధించి గ్రామంలో బాలంవారిపాలెం , వెన్నరపువారిపాలెం, రావిగుంట పాలాలకు నీరు సరఫరా అవడం లేదు. ఆచంటలో ప్రస్తుతం 9 వాటర్ ట్యాంక్‌లు ఉండగా ఆచంట పెదపేట, చినపేటకు సంబంధించి మరో రెండు వాటర్ ట్యాంక్‌లు కావాల్సి ఉంది. గ్రామంలో సుమారు 20 వేల మంది జనాభా ఉన్నారు. ఇటీవల కొత్తగా కట్టుకున్న ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేయాల్సి ఉంది. గ్రామంలో సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నాం. ఈ నీరు తాగితే ప్రజలకు కాళ్ళు లాగడం, మోకాళ్ళ నొప్పులు వంటి సమస్యలు రావని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ (ఇన్‌చార్జి) సాయిప్రకాష్ తెలిపారు.

• ఆర్వో వాటర్‌కు అలవాటుపడ్డారు



అధికారులు కుళాయిలు ద్వారా సరఫరా చేసేనీటిని ప్రజలు వాడకానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. ఎక్కువ మంది ఆర్వో ప్లాంట్ నీటికి అలవాటుపడ్డారు. గ్రామంలో అనేక చోట్ల ఆర్వో వాటర్‌ప్లాంట్‌లు ఉండటంతో అందరూ కూడా ఈ నీటినే కొంటున్నారు. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి.

షేక్ ఇస్మాయేల్ జాని, ఆచంట

వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు..

ఉంగుటూరు : ఉంగుటూరు మండలం కాకర్లమూడి, రావులపర్రు, కాగుపాడు, ఉప్పాకపాడులలో ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులతో ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రజలు వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. తల్లాపురంలో ఫిల్టర్‌బెడ్‌లను ఉపయోగించడం లేదని తెలిసింది. నాచుగుంటలో వాటర్ పైపులు పగిలిపోవడం వల్ల తాగునీటి సరఫరాకు ఆటంకం కలుగుతోంది. నారాయణపురం, ఉంగుటూర్లలో నిర్వహణ లోపం వల్ల తరచూ సరఫరాలో ఆటంకం కలుగుతోంది.

పాములపర్రులో కటకట..

పంటకాల్వ నీరు కాలుష్యం



ఉండి : ఉండి మండలం పాములపర్రులో మంచినీటి చెరువు అభివృద్ధి చేసి 20 సంవత్సరాలకు పైబడి అయ్యింది. చెరువు చాలా వరకు పూడికపోయింది. చెరువులోని నీరు పసర్లుపట్టి తాగు నీటికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఉండి పంటకాల్వ నుంచి పాములపర్రు చెరువులోకి చేరాలి. అయితే ఉండిలో పంటకాలువ ప్రధాన రహదారి వెంబడి వుండడంతో పంటకాల్వలోకి చెత్తచేరి నీరు కాలుష్యమవుతోంది. పంటకాల్వ చుట్టూ ఫెన్సింగ్ వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా దాంతో గత నవంబరులో ఉండి నుంచి పాములపర్రు వెళ్లే పంటకాలువను శుభ్రం చేశారు. దాంతో సమస్య కొంత పరిష్కార మైంది.

• స్వచ్ఛమైన నీరు అందించడానికి చర్యలు



సొంతనిధులను వెచ్చించి ఉండి నుంచి పాములపర్రు చేరే పంట కాల్వలో చేరే చెత్త, వ్యర్థాలను తొలగిస్తున్నాం. సంక్రాంతి పండుగ వెళ్లిన తరువాత చెవురులో పూడికపనులు, చెత్త తొలగింపు పనులు చేపడతాం. జలజీవన్‌మిషన్ ద్వారా 49.60 లక్షలు మంజూరైంది. పంచాయితీ పరిధిలోని వెంకట్రాజుపు రానికి కూడా రూ.8.30 లక్షలు మంజూరైంది. ప్రస్తుతం చెరువులోకి కొత్తనీరును లిఫ్ట్ చేయిస్తున్నాం. పనులు పూర్తియితే ప్రజలకు మంచినీటికి ఇబ్బందులు వుండవు.

కేసన శాంతకుమారి, సర్పంచ్, పాములపర్రు

వీరవాసరాన్ని వీడని మంచినీటి సమస్య

వీరవాసరం, (భీమవరం టౌన్) : మేజర్ గ్రామపంచాయతీ.. మండల కేంద్రం.. అయినా వీరవాసరాన్ని తాగునీటి సమస్య వెంటాడుతూనే ఉంది. గ్రామ ప్రజల అవసరాలకు తగినట్లుగా స్వచ్ఛమైన తాగునీరు దొరకటం లేదు. తూర్పు చెరువు ఎల్లమ్మ చెరువు వద్ద నాలుగు లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓహెచ్ ఎస్ఆర్‌లు ఉండగా సుమారు ఏడు ఎకరాలు విస్తీర్ణంలో వీటికి అనుగుణంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఉంది. అయినప్పటికీ స్వచ్ఛనీటి కోసం వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తూ రక్షిత నీటి సరఫరా పథకాల ద్వారా వచ్చే నీటిని గృహ అవసరాలకే వినియోగిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ ద్వారా వీరవాసరం ఎస్టీ కాలనీ ప్రాంతంలోనూ, రెస్ట్‌హౌస్ చెరువు వద్ద, తీర్థాల పుంతలోనూ అదనపు ఓహెచ్‌ఎస్ఆర్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. రెస్ట్‌హౌస్ చెరువు హైస్కూల్ సమీపంలో ఓహెచ్‌ఎస్ఆర్ నిర్మాణం ప్రారంభమైంది. తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో నిలిచిపోయింది. ప్రస్తుతం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికి కుళాయి ఇచ్చే పనులు సాగుతున్నాయి.


వీరవాసరంలో ఇటీవల శుభ్రం చేసిన ఫిల్టర్ బెడ్


యువజనోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న గౌరవాధ్యక్షుడు డాక్టర్ బలరామ్, సభ్యులు

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి యువజనోత్సవాలు

ఆకివీడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పండుగ సమయాల్లో కోడిపందాలు,జూదాలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ సంక్రాంతి యువజనోత్సవాల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ బలరామ్ ప్రతాప్‌కుమార్ అన్నారు. డీవైఎఫ్ఐ 42వ సంక్రాంతి యువజనోత్సవాలు ఈనెల 8 నుంచి 16 వరకు దాతల సహకారంతో చెడుగుడు, క్రికెట్, వాలీబాల్, చెస్, పాటలు, డ్యాన్స్, రంగవల్లులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దుంపగడప కళాశాల, స్థానిక జిల్లాపరిషత్ బాలురు ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణాల్లో పోటీలు జరుగుతాయన్నారు.గురువారం బలరామ్ నర్సింగ్ హోమ్ వద్ద విలేకర్ల సమావేశంలో పోటీల వివరాలు తెలిపారు. జనవరి 8 నుంచి 11 వరకు ఉండి, భీమవరం, కైకలూరు నియోజకవర్గ స్థాయి క్రికెట్, 13, 14న కృష్ణ, పశ్చిమ గోదావరి జిల్లాల వాలీబాల్, 13న జిల్లాస్థాయి పాటలు, మండల స్థాయి డ్యాన్స్ పోటీలు, రాష్ట్రస్థాయి చెడుగుడు 14,15,16 వరకూ, 14న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాస్థాయి చదరంగం పోటీలు, పట్టణస్థాయి రంగవల్లులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు ఉంటాయన్నారు. నిర్వహణ కమిటీ కన్వీనర్ డోకల రవితేజ, ఆహ్వాన సంఘం కార్యదర్శి గేదెల ధనుష్, కోశాధికారి బొడ్డుపల్లి రాంబాబు, పెంకి అప్పారావు, గోపిశెట్టి రాంబాబు తదితరులు ఉన్నారు.


రామాలయంలో దీపోత్సవం వత్తులకు పూజలు

అయోధ్యకు 6 లక్షల దీపోత్సవ వత్తులు

చాట్రాయి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో జరిగే కోటి దీపోత్సవానికి అపర భద్రాద్రి చనుబండ కోదండ రామాలయం నుంచి 6 లక్షల దీపోత్సవ వత్తులను పంపారు. రామాలయంలో మహిళా భక్త బృందం సభ్యులు జైశ్రీ రామ్ నామాన్ని జపిస్తూ వత్తులు తయారు చేసి నువ్వుల నూనెతో తడిపి ప్యాకింగ్ చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులు, రాజమహేంద్రవరం కృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కల్యాణ అప్పారావు, భక్తులు వత్తులను స్వామి వారి ముందు ఉంచి పూజలు చేసి అయోధ్యకు పంపారు. సీతా రాముల కల్యాణానికి శ్రీ కృష్ణ చైతన్య సంఘం వానర సేనతో సాగు చేసి పండించిన ధాన్యాన్ని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి గోటితో వలిచి తలంబ్రాలు తయారు చేయడం కోసం భక్తులకు అందజేశారు. ఈ విధంగా తయారు చేసిన స్వామివారి తలంబ్రాలను అయోధ్య, భద్రాచలం, చనుబండలలో జరిగే శ్రీసీతారామ కల్యాణంలో వినియోగిస్తామని అప్పారావు చెప్పారు.

శ్రీకూర్మనాథునిగా అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి


శ్రీ కూర్మనాధుడు

పాలకొల్లు అర్బన్, జనవరి, 2 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం 18వ రోజు గురువారం పాలకొల్లు అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో మందర పర్వతాన్ని తనపై భారం మోపిన పెరుమాళ్‌ను, శ్రీకూర్మనాథుడి అవతారంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. టీటీడీ ప్రభంద ట్రస్టు అనుమతి పొందిన నూలి మాధురి తిరుప్పావై ప్రవచనం చేశారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, పవన్ కుమార్, వెంకట కృష్ణమాచార్యులు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, తిరుమంజన సేవలు నిర్వహించారు. ఉదయం రేపాక సుధారాణి వీణాగానంతో ప్రభాత సేవ చేశారు.



వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

ద్వారకాతిరుమల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస మండపంలో కొలువైన శ్రీవారు, అమ్మవార్లకు నిర్వహించిన ధనుర్మాస ఉత్సవం గురువారం ఉదయం రమణీయంగా జరిగింది. ధనుర్మాస పర్వదినాలను పురస్కరించుకుని శ్రీవారు, ఉభయదేవేరులు, గోదాదేవితో కలసి క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. తమ ఇంటి ముంగిటనున్న మూర్తులను ఎంతో భక్తిప్రపత్తులతో దర్శించారు. తరువాత మండపంలో కొలువుతీరి భక్తులను కటాక్షించారు. అర్చకులు పూజలు జరిపి హారతులిచ్చారు. ప్రసాదాలను పంపిణీ చేశారు.

నరసాపురం-మచిలీపట్నం కొత్త రైల్వే లైన్‌కు డీపీఆర్ సిద్ధం

అన్ని నియోజకవర్గాల్లో డయాలసిస్ సెంటర్లు
నరసాపురం- వారణాసి మధ్య కొత్త రైలుకు ప్రతిపాదన
కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ


మంత్రికి బొకే అందిస్తున్న కొవ్వలి నాయుడు

నరసాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి):నరసాపురం-మచిలీపట్నం మధ్య చేపట్టే కొత్త రైల్వేలైన్ పనులకు డీపీఆర్ సిద్ధమైందని, రానున్న బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు నిధులు విడుదల య్యే ఛాన్స్ ఉందని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. గురువారం నరసాపురంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నరసాపురం- కోటిపల్లి రైల్వేలైన్ జాప్యానికి నిధులు, భూసేకరణనే కారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ళల్లో ఇవ్వాల్సిన వాటా మొత్తంలో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఈ బడ్జెట్‌లో విడుదలయ్యే నిధులతో ఈ పనులు వేగవంతం అవుతాయన్నారు. నరసాపురం వారణాశిల మధ్య కొత్త రైలు, నరసాపురం-సికింద్రాబాద్‌ల మధ్య వందేభారత్ రైలు ప్రతిపాదనలో ఉంద న్నారు. త్వరలో భీమవరం-చెన్నైల మధ్య వందేభారత్‌ను కూడా తీసుకొస్తామన్నారు. కూటమి రాకతో రాష్ట్రంలో పరిస్థితి మారిందని, పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం నెలకొందన్నారు.

165ఎన్‌హెచ్‌కు ఐదు ఎలైన్‌మెంట్లు

పాలకొల్లు మండలం దిగమర్రు నుంచి ఆకివీడు వరకు నిర్మించే 165 జాతీయ రహదారికి ఐదు ఎలైన్‌మెంట్లను ఎన్‌హెచ్ అధికారులు ప్రతిపాదించారన్నారు. వీటితో పాటు రైల్వే క్రాసింగ్‌ల వద్ద నిర్మించే ఆర్వోవి వంతెన నిర్మాణాల ఖర్చు, తదితర ప్రతిపాదనలు పూర్తికాగానే ఈ పనులకు నిధులు విడుదల అవుతాయన్నారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో డయాలసీస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వీటికి రూ.10కోట్లు కేంద్రం నిధులు విడుదల చేస్తున్నామన్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతల్ని అప్పగిస్తామన్నారు. తణుకు, టీపీగూడెం కేంద్రాల్లో డయాలసిస్ సెంటర్లను అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని బరియల్ గ్రౌండ్‌లకు ఫెన్సింగ్ వాల్‌కు అవసరమైన నిధుల్ని మంజూరు చేస్తామన్నారు. అంతకు ముందు శ్రీనివాసవర్మను కొవ్వలి నాయుడు, పొత్తూరి ఘనంగా సత్కరించారు. నారిన తాతాజీ, మేకల సతీశ్, పీవీఆర్, బొమ్మిడి సునీల్, సంకు భాస్కర్, మల్లాడి మూర్తి తదితరులు పాల్గొన్నారు.


ప్రతాప్‌నాయుడుకి నివాళులర్పిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, విప్ నాయకర్, మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు తదితరులు

రైతు బిడ్డ ప్రతాప్ నాయుడుకు ఘన నివాళి

నరసాపురం రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏ పదవి నిర్వహించినా... దానికి వన్నే తెచ్చి ప్రజల మనస్సుల్లో నిలిచిన గొప్ప వ్యక్తి బండారు ప్రతాప్ నాయుడు అని పలువురు కీర్తించారు. గురువారం సరిపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు తండ్రి ప్రతాప్ నాయుడు సంస్మరణ సభ జరిగింది. దీనికి కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ, విప్ నాయకర్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ రాజ్య సభ సభ్యురాలు సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీలు అంగర రామ్మోహన్‌రావు, శేషుబాబు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, చాగంటి చిన్న విచ్చే శారు. ప్రతాప్‌నాయుడు చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్‌గా, నీటి సంఘం అధ్యక్షులుగా సేవల ందించి రైతుబిడ్డగా మనస్సుల్లో నిలిచారన్నా రు. నేత్రదానం చేసి పది మందికి ఆదర్శ ంగా నిలిచారన్నారు. బండారు మాధవనాయుడు, కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.

పథకం ప్రకారం ఇరికిస్తున్నారు: ప్రభావతి


చికిత్స పొందుతున్న ప్రభావతి

నూజివీడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి):పథకం ప్రకారం తనపై కక్ష సాధిస్తూ కేసుల్లో ఇరికిస్తున్నారని, యూనియన్ బ్యాంకులో పని చేస్తూ సస్పెండ్ అయిన దావులూరి ప్రభావతి ఆరోపించారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె మాట్లాడుతూ తాను గంగూరు యూనియన్ బ్యాంకు మేనేజరుగా పని చేస్తున్నప్పటి నుంచి సీతారాంపురానికి చెందిన వైసీపీ నాయకుడు కవులూరి యోగేంద్ర తనను టార్గెట్ చేసి అసత్య ఆరోపణలు చేస్తూ పథకం ప్రకారం కేసుల్లో ఇరికిస్తున్నాడన్నారు. ఇదే కోవలో జనసేన నాయకుడిగా చెప్పుకునే వెంకట్రావు బుధవారం తన ఇంటి సమీపానికి వచ్చి అసభ్య పదజాలంతో దూషించడంతో తన తండ్రి, సోదరుడు ఆయనను పడదోశారన్నారు. ఆ సమయంలో పెనుగులాట జరగ్గా, అసభ్యంగా ప్రవర్తించడంతోనే వెంకట్రావుపై చేయి చేసుకున్నానన్నారు. ఆపై వెంకట్రావును పోలీసులకు అప్పగించింది తానేనన్నారు. అయితే ఈ ఘటన సైతం ఒక పథకం ప్రకారమే జరిగిందనేందుకు వీడియో తీయటమే ఉదాహరణ అన్నారు. వెంకట్రావు వ్యవహరించిన తీరు ఎలా ఉందనేది తన ఇంటి సీసీ ఫుటేజ్‌ల్లో ఉందని, నిజానిజాలు పరిశీలించి తనకు, తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె కోరారు. తనపై నూజివీడు, ఇతర ప్రాంతాల్లో పెట్టిన కేసులన్నీ నిరాధారమైనవని, ఎవరో తనకు తెలియని వారితో తనపై కేసులు బనాయించటం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అధికార పార్టీ అండ చూసుకుని యోగి తనపై అక్రమ కేసులు బనాయించగా, అవి ఇప్పటికి కొనసాగించటం శోచనీయమన్నారు.

ఇరుపక్షాలపై కేసులు

నూజివీడు మండలం మర్రిబంధం గ్రామంలో జనసేన నాయకుడు వెంకట్రావు, బ్యాంకు ఉద్యోగిని దావులూరి ప్రభావతిల విషయంలో ఇరుపక్షాలపై కేసులు నమోదు చేసినట్లు నూజివీడు రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు తెలిపారు.

అర్హత సాధించిన 211 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు


ఏలూరులో కానిస్టేబుల్ అభ్యర్థుల పరుగు పందెం పరిశీలిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కానిస్టేబుళ్ళ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గత నెల 30వ తేదీ నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న 204 పోస్టుల భర్తీకి రాష్ట్ర పోలీసుల రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన 4976 మంది అభ్యర్థులు అర్హత సాధించగా వీరిలో పురుష అభ్య ర్థులు 3997 మంది కాగా, మహిళా అభ్యర్థి నులు 979 మంది ఉన్నారు. గురువారం 600 మంది అభ్యర్థులకుగాను 346 మంది హాజరయ్యారు. వీరిలో 211 మంది అభ్యర్థు లు అర్హత సాధించారు.

మహిళా అభ్యర్థినులకు స్పోర్ట్స్ ఈవెంట్స్

పోలీస్ కానిస్టేబుళ్ళ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ప్రిలిమనరీ పరీక్షల్లో అర్హత సాధించిన 979 మంది మహిళా అభ్యర్థినులకు ఈనెల 3, 4 తేదీలలో ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ ఈవెంట్స్‌ను నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా మహిళా అధికారులతో ఈ పోటీ పరీక్షలను నిర్వహించడానికి జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్‌కు వెళ్లే వాహనాల దారి మళ్లింపు

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : హైందవ శంఖారావం మహాసభ ఈనెల 5వ తేదీన కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో జరుగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్ళింపుకు పోలీసులు నిబంధనలు విధించారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్ళే వాహనాలు భీమడోలు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, చింతలపూడి, ఖమ్మం మీదుగా హైదరాబాద్‌వైపు వెళ్ళాలన్నారు. ఏలూరు బైపాస్, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట, ఖమ్మం మీదుగా కూడా హైదరాబాద్ వెళ్ళవచ్చన్నారు.

ఆక్వాకు ఆధునిక పరిజ్ఞానం జోడించాలి

మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్


రైతులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ రాష్ట్ర కమిషనర్ డోలా శంకర్

యలమంచిలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): దేశానికి అత్యధికంగా విదేశీ మారకద్రవ్యం అందిస్తున్న ఆక్వారంగంలో ఆధునిక పరిజ్ఞానాన్ని జోడించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదని మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్ పేర్కొన్నారు. మండలంలోని కలగంపూడి గ్రామంలోని పొత్తూరి పద్మనాభరాజుకు చెందిన ఆక్వాచెరువులలో కౌంట్ 366 పేరున ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సెన్సార్ పరికరాలను మత్స్యశాఖ రాష్ట్ర కమిషనర్ డోలా శంకర్ పరిశీలించారు. పరికరాల పనితీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆక్వాసాగులో రైతులు కౌంట్ 366 పేరున ఏర్పాటుచేసిన ఆధునిక సాంకేతిక సెన్సార్ పరికరాలను వినియోగిస్తే చెరువుల్లో నీటి నాణ్యత, పీహెచ్, డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ (డీవో) స్థాయిలను ఎప్పటికప్పుడు రైతుల సెల్‌ఫోన్లకు సమాచారం అందిస్తుందని వివరించారు. ఈ పరికరాల వినియోగంతో డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ స్థాయిలకు అనుగుణంగా ఆటోమేటిక్ పద్ధతిలో ఏరియేటర్లను ఆపరేట్ చేయవచ్చని తద్వారా 25శాతం వరకూ విద్యుత్ ఆదా అవుతుందన్నారు. చెరువుల్లో నీటి నాణ్యత స్థాయిలు నిర్దేశిత ప్రమాణాల్లో లేనప్పుడు రైతులకు ఎలర్ట్ మెసేజ్‌లను ఈ పరికరాలు అందిస్తాయన్నారు. ఆక్వా రైతాంగం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం రాయితీ కల్పించే అంశాన్ని పరిశీలిస్తుందని తెలిపారు. జిల్లాలో 16,300 ఆక్వారంగ విద్యుత్ కనెక్షన్లు ఉండగా 13,648 విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ రాయితీ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ లాల్ మహ్మద్, డి.ఎఫ్.వో ఆర్.వి.ఎస్.ప్రసాద్, భీమవరం ఏడీ ఎల్.ఎల్.ఎన్.రాజు, ఆక్వాజెనిక్స్ ప్రో సంస్థ సిఈవో సలాది గోపికృష్ణ, కొమ్ముల మురళీకృష్ణ, పొత్తూరి పద్మనాభరాజు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతికి ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని దక్షిణమధ్య రైల్వే అధికారులు ఏలూరు మీదుగా ఆరు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. కాచిగూడ నుంచి కాకినాడ టౌన్‌కు వెళ్ళే రైలు (07653) కాచిగూడలో గురువారం, శుక్రవారాల్లో బయలుదేరుతుంది. కాకినాడ టౌన్ నుంచి కాచిగూడ వెళ్ళే రైలు (07654) కాకినాడలో శనివారం, సోమవారం బయలుదేరుతుంది. ఈ రైళ్లు కాచిగూడ, మల్కాజ్‌గిరి, చెర్లపల్లి, నల్గొండ, మిర్యాల గూడ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లి గూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్ల కోట, కాకినాడలలో ఆగనుంది. రైల్‌నెంబర్ 07023 హైద రాబాద్ నుంచి కాకినాడ టౌన్‌కు శుక్రవారం వెళ్తుంది. రైల్‌నెంబర్ 07024 కాకినాడ టౌన్ నుంచి హైదరాబాద్‌కు శనివారం కాకినాడలో బయలుదేరుతుంది. ఈరెండు రైళ్ళు హైదరాబాద్, సికింద్రాబాద్ జంక్షన్, పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు జంక్షన్, కృష్ణాకెనాల్, విజయవాడ జంక్షన్, గుడివాడ జంక్షన్, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, అనపర్తి, సామర్ల కోట జంక్షన్, కాకినాడ టౌన్ స్టేషన్లలో ఆగనున్నాయి.

క్రైమ్ కార్నర్

గోవా బీచ్‌లో న్యూ ఇయర్ వేడుకలు

గూడెం యువకుడి హత్య


రవితేజ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గోవా బీచ్‌లో నూతన సంవత్సర వేడుకలు జరుపు కునేందుకు స్నేహితులతో వెళ్లిన తాడేపల్లిగూడెంకు చెందిన యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుచూసింది. స్థాని కులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం 6వ వార్డుకు చెందిన బొల్లా రవితేజ (26) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అయితే నూతన సంవత్సర వేడుకలను గోవాలో స్నేహితులతో జరుపుకునేందుకు గత శనివారం వెళ్ళాడు. ఆదివారం రాత్రి కలంగూట్ బీచ్‌లో స్నేహి తులతో సరదాగా గడిపి పక్కనే రెస్టారెంట్‌లో భోజనం చేసేందుకు వెళ్లారు. అక్కడ రెస్టారె ంట్ యజమాని కొడుకు సిల్వేరా, అతడి స్నేహితులు ఒక మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఘర్షణ తలెత్తింది. దీంతో హోటల్ సిబ్బంది అంతా కలిసి ఈ ఘర్షణ లో రవితేజ తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఆ మృతదేహం స్వస్థలం చేరడానికి ఇబ్బంది లు తలెత్తడంతో స్థానిక ఎమ్మెల్యే చొరవతో ప్రత్యేక విమానంలో తాడేపల్లిగూడెంకు బుధవారం తీసుకువచ్చారు.

తల్లిదండ్రులు తిట్టారని విద్యార్థి ఆత్మహత్య


ప్రవీణ్ (ఫైల్)

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సరిగా చదవడంలేదని తల్లి దండ్రులు మందలించడంతో విద్యార్థి తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరులోని మంచినీళ్ళతోటకు చెందిన కటకం దుర్గా ప్రసాద్, దేవి దంప తులు వస్త్రాల దుకాణాల్లో పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు దుర్గా ప్రమోద్‌కుమార్ మైలవరంలో ఒక ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. చిన్న కుమారుడైన షణ్ముఖ ప్రవీణ్ (13) ఏలూరు అశోక్‌నగర్‌లో ఉన్న అమలోద్భవి స్కూలులో 9వ తరగతి చదువుతున్నాడు. అతని సోదరుడు ప్రమోద్‌కుమార్ వెళ్ళిపోయినప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ సరిగా చదవలేకపోతు న్నాడు. దీంతో తల్లి దండ్రులు అతనిని మందలించారు. గతనెల 31వ తేదీన కూడా మందలించారు. ఈనెల 1వ తేదీ రాత్రి తల్లి దండ్రులు రాత్రి ఇంటికి వచ్చేటప్పటికి ఇంట్లో ఒంటరిగా ఉన్న షణ్ముఖ ప్రవీణ్ ఉరి వేసు కుని వేలాడుతూ కనిపించాడు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చేపలకు మేత వేస్తూ రైతు మృత్యువాత


కల్యాణ్

పెదపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చేపలకు మేత వేస్తూ ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి చెందాడు. పెదపాడు ఎస్ఐ శారదా సతీశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలం రాజుపేట గ్రామానికి చెందిన గుండపనేని కల్యాణ్ గురువారం మధ్యాహ్నం చేపలకు మేతవేస్తూ ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయాడు. అక్కడకు సమీపంలో ఉన్నవారు గమనించి బయటకు తీసి, ఏలూరు ఆస్పత్రికి తరలించారు. అయితే కల్యాణ్(40) అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

దొంగనోట్ల ముఠా అరెస్టు

రెండున్నర లక్షల రూపాయల అసలైన నోట్లు
15 లక్షల నకిలీ నోట్లు స్వాధీనం


నకిలీనోట్లు, చైన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : అసలు నోట్లకు దొంగ నోట్లు అధిక మొత్తంలో ఇస్తామని మోసగిస్తున్న ఒక ముఠాను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకాతిరుమల ఎస్ఐ వి.సుధీర్ వారి సిబ్బంది కలిసి ముఠాలోని ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు పరీరాలో ఉన్నాడు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. ద్వారకాతిరుమలలో ఒక వ్యక్తివద్ద నుంచి రెండున్నర లక్షల అసలు నోట్లను తీసుకుని 15 లక్షల దొంగ నోట్లను ఒక ముఠా మార్చుకుంటుందని సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కోడూరి రవి తేజ (28) ప్రస్తుతం జంగారెడ్డిగూడెంలో ఉంటూ దొంగ నోట్ల మార్పిడి ముఠాను తయారు చేశాడు. జంగారెడ్డిగూడెం పద్మాథియేటర్ సమీపంలో నివాసం ఉంటున్న షేక్ నాగూర్‌మీరావలి (25) జంగారెడ్డి గూడెం మసీదు సెంటర్‌కు చెందిన వీరంకి రాజేశ్ (28)లతో రవితేజ ముఠా ఏర్పాటు చేసుకున్నారు. నాగూర్‌మీరావలి, వీరంకి రాజేష్‌లు 15 లక్షల రూపాయల నకిలీ నోట్లను తీసుకుని గురువారం ద్వారకాతిరుమలలో రోడ్డుపక్కన హోటల్ నడుపుకుంటూ జీవించే కొల్లు సుబ్రహ్మణ్యం అలియాస్ సుభాష్ (40) వద్దకు వెళ్ళి డబ్బులు మార్పిడి చేస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఈ ముగ్గురిని అరెస్టు చేశారు. వీరి నుంచి అసలైన నోట్లు రెండున్నర లక్షల రూపాయలు, నకిలీ నోట్లు (500రూపాయలు) 15 లక్షల రూపాయలు, ఒక మోటారు సైకిల్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కోడూరి రవితేజ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టారు.

కోళ్ల లోడు వ్యాన్ బోల్తా

400 కోళ్లు మృత్యువాత



ఆకివీడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కోళ్లలోడు వ్యాన్ తిరగబడింది. స్థానిక బజార్‌లోని కోళ్ల చికెన్ సెంటర్ దుకాణంలో గురువారం కోళ్ల దిగుమతి చేసి తాడేపల్లిగూడెం బయలు దేరింది. పెద్ద వంతెన సమీపంలోని పశువుల ఆసు పత్రి దగ్గర కోళ్లలోడ్ వ్యాన్ తిరగబడడంతో డ్రైవర్,క్లీనర్‌కు స్వల్ప గాయాల య్యాయి. వ్యాన్‌లో ఉన్న సుమారు 400 కోళ్లు మృత్యు వాతపడ్డాయి. సుమారు రూ.4లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నిత్యావసర సరుకులు తెచ్చేందుకు వెళ్లి వృద్ధుడి మృతి



జీలుగుమిల్లి, జనవరి, 2: (ఆంధ్రజ్యోతి): దర్భగూడెంకు చెందిన పైడిమర్ల సోమిరెడ్డి (70) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన సోమిరెడ్డి జంగారెడ్డిగూడేనికి నిత్యావసర సరుకులు కొనుగోలుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో లక్ష్మీపురం వద్ద ఉంచిన సైకిల్ తీసుకుని కిరాణ సరుకులు తెస్తుండగా దర్భగూడెం జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి వస్తున్న బొగ్గులోడు లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తల నుజ్జయి అక్కడికక్కడే సోమిరెడ్డి మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై పి.నవీన్ కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం తరలించి, కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ఉండి, జనవరి2(ఆంధ్రజ్యోతి): బొండాడ డ్రెయిన్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహానికి సంబంధించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఉండి పోలీసులు తెలిపారు. మృతదేహం గురించి చుట్టుపక్కల విచారించగా ఎటువంటి ఆచూకీ లభించలేదని తెలిపారు. గురువారం అనుమానాస్పద మృతికేసుగా నమోదు చేసినట్లు తెలిపారు. మహిళకు 40నుంచి 45 సంవత్సరాలు వుంటాయని, పూర్తి వివరాలు తెలియవలసి వుందని తెలిపారు. పాములపర్రు పంచాయితీ పరిధిలోని కొండ గూడెం నుంచి ఉండి మీదుగా ప్రవహించే బొండాడ డ్రెయిన్‌లో ఉండి పడవలరేవు వద్ద మహిళ మృతదేహం లభించిందని పోలీసులు తెలిపారు. వీఆర్వో మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పాత గొడవలతో కత్తితో దాడి

పెంటపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : పాత గొడవల నేపథ్యంలో వ్యక్తిపై మరొక వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన బుధవారం అర్ధరాత్రి దర్శిపర్రు గ్రామంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వల్లూరుపల్లి గ్రామా నికి చెందిన జాలాది గంగరాజు, అదే గ్రామా నికి చెందిన సేకూరి శ్రీనులకు పాతగొడవలు ఉన్నాయి. బుధవారం రాత్రి దర్శిపర్రు గ్రామంలో జరుగుతున్న జాతర కార్యక్రమానికి గంగరాజు వెళ్ళాడు. ఈ విషయం తెలుసు కున్న శ్రీను కూడా జాతరకు వెళ్ళి అర్ధరాత్రి దాటిన తరువాత ఎవరూ లేని సమయం చూసి గంగరాజుపై కత్తితో దాడి చేశాడు. దీంతో మెడపై తీవ్ర గాయం అయిన గంగరాజు ను స్నేహితులు తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాదితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నింది తున్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

మాజీ హోం గార్డు చైన్ స్నాచింగ్

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న మాజీ హోంగార్డును పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ గురువారం ఏలూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్ 16వ తేదీన ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలు బొమ్మిడి గ్రామంవైపు నడుచుకుంటూ వెళ్తుండగా ఒక వ్యక్తి మోటారు సైకిల్‌పై వచ్చి ఆమెను ఎక్కించుకుని దించుతానని చెప్పి కొద్ది దూరం వెళ్ళిన తరువాత ఆకస్మాత్తుగా మోటారు సైకిల్ ఆపి ఆమె మెడలో ఉన్న సూత్రాల తాడును తెంపుకుని పరారీ అయ్యాడు. ఈ సంఘటనపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. నిడమర్రు సీఐ ఎంవి సుభాష్ ఆధ్వర్యంలో నిడమర్రు ఎస్ఐ ఎన్ వీర ప్రసాద్, గణపవరం ఎస్ఐ మణికుమార్, సిబ్బంది కలిసి ఒక బృందంగా ఏర్పడ్డారు. సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. దీంతో ఈనేరానికి పాల్పడిన వ్యక్తి రాజస్థాన్‌కు చెందిన మహేందర్‌సింగ్ (30)ను గుర్తించారు. మహేందర్‌సింగ్ గతంలో హైదరాబాద్‌లో ఉంటూ హోంగార్డుగా పనిచేసేవాడు. అతను నేరాలకు పాల్పడుతుండడంతో అతనిని శాశ్వతంగా హోంగార్డు ఉద్యోగం తీసివేశారు. అప్పటి నుంచి అనేక ప్రాంతాలు మారిపోతూ కొద్ది కాలం నివాసం ఉంటూ నేరాలకు పాల్పడుతున్నాడు. ప్రస్తుతం విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీలో ఉంటూ మోటారు సైకిల్‌పై వివిధ జిల్లాలు తిరుగుతూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడు. గురువారం తెల్లవారు జామున అతనిని అరెస్టు చేసి మూడున్నర కాసుల బంగారు నానుతాడును స్వాధీనం చేసుకున్నారు.

ఫోన్ పోయింది..

అకౌంట్‌లో రూ.99 వేలు కొట్టేశారు..


బాధితుడు పాపిరెడ్డి

చాట్రాయి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కిరాణా షాపుకు వెళితే అక్కడ ఫోన్ పోయింది. కొద్ది సేపటిలోనే అకౌంట్‌లో ఉన్న రూ.99 వేలు కొట్టేసిన సంఘటన ఆలస్యంగా తెలిసింది. ఈ సంఘటన డిసెంబరు 30వ తేదీన జరగ్గా వెంటనే బాధితుడు చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం చాట్రాయిలో కెఎంఆర్ ఇరిగేషన్ షాపు యజమాని కుప్పిరెడ్డి పాపిరెడ్డి డిసెంబరు 30వ తేదీ ఉదయం కిరాణా షాపుకు సరుకుల కోసం వెళ్ళగా ఫోన్ పోయింది.

అదే రోజు పాపిరెడ్డి బ్యాంకు వెళ్ళి ఆరాతీయగా అకౌంట్‌లో రూ.99 వేలు ఒడిస్సాలోని రెండు అకౌంట్లకు ఫోన్‌పే ద్వారా బదిలీ అయినట్లు తెలుసుకొని అవాక్కయ్యాడు. ఫోన్ ఉదయం 8 గంటలకు పోతే, 8.37 నుంచి 9.35 మధ్యలో రూ.50 వేలు, రూ.20 వేలు, రూ.7 వేలు, రూ.22 వేలు కేటుగాళ్ళు డబ్బు లాగేశారు. నారాయణ మోహంతీ, అబ్దుల్ మజీద్ ఖాన్ అకౌంట్లకు డబ్బు బదిలీ అయినట్లు గుర్తించారు. యూపీఐ పిన్ నెంబరు లేకుండా కేటుగాళ్ళు టెక్నాలజీని ఉపయోగించి డబ్బు ఎలా కొట్టేశారో తెలియటం లేదని బాధితుడు అంటున్నారు. పాపిరెడ్డి వెంట ఫాలో అయ్యి ఆయన ఆదమరుపుగా ఉన్నప్పుడు ఫోన్ దొంగిలించి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై ఎస్సై రామకృష్ణను వివరణ కోరగా బాధితుడు ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నామని అన్నారు.

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

టి.నరసాపురం, జనవరి 2, (ఆంధ్రజ్యోతి) : చీరకు నిప్పంటుకుని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన అల్లంచర్లరాజుపాలెంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన శీలం సీతారావమ్మ(61) డిసెంబరు 31 సాయంత్రం ఇంటి వద్ద మంట వేసి చలికాగుతుంది. ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకుంది. కేకలు వేయటంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో చింతలపూడి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి జనవరి 1న మృతి చెందింది. ఎస్సై ఎం.జయబాబు మృతురాలి కుమార్తె యడ్లపల్లి నాగలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఫ్లిప్‌కార్ట్ కార్యాలయంలో చోరీ

ఏలూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఫ్లిప్‌కార్ట్ కార్యాలయ షట్టర్ తాళాలు తీసి లాకర్ పగులగొట్టి అందులో ఉన్న రూ.3,73,592 నగదును డిసెంబరు 31 రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దోచుకుపోయారు. ఈ విషయమై కార్యాలయ మేనేజరు డి.వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు.



రాట్నాలమ్మవారి సన్నిధిలో శ్రీలలిత దంపతులు

రాట్నాలమ్మను దర్శించిన గాయని శ్రీలలిత

పెదవేగి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గాయని శ్రీలలిత రాట్నాలకుంట రాట్నాలమ్మను భర్త సీతారామ్‌తో కలిసి గురువారం దర్శించుకున్నారు. అమ్మవారికి పూజలు చేసి తన గానంతో అమ్మవారిని కీర్తించారు. ఆలయ అర్చకులు శ్రీలలిత దంపతులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఎమ్మెల్యే మద్దిపాటికి ఆర్యవైశ్యుల ఆహ్వానం

ద్వారకాతిరుమల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఈనెల 5న జరుగనున్న డూండీ రాకేష్ ప్రమాణస్వీకార మహోత్సవానికి హాజరుకావాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును నియోజక వర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఇమ్మడి రత్నాజీ ఆహ్వానించారు. ఆర్యవైశ్యుల తరుపున ఎమ్మెల్యేను సత్కరించారు. ఆహ్వాన పత్రిక అందించి తప్పక రావాలని కోరారు.

అంతర్జాతీయ వెబినార్ బ్రోచర్ల విడుదల

ఏలూరు అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): 'రీసెర్చ్ మెథడాలజీ ఇన్ మెటీరియల్స్ సైన్స్' అంశంపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కైకలూరు వైవీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో అంతర్జాతీయ వెబినార్ జరగనుంది. వెబినార్ బ్రోచర్లను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు విడుదల చేశారు. వెబినార్ కోఆర్డినేటర్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభకు తరలిరండి

ఏలూరు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 5న జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభకు బ్రాహ్మణులు తరలిరావాలని బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఓటుబ్యాంకు రాజకీయాల కోసం హిందూ సమాజాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. బ్రాహ్మణులు, అర్చకులు, వేదపండితులు విజయవాడ బహిరంగ సభకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆపదలో ఉన్నవారికి ప్రభుత్వం అండ

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేసిన చింతమనేని



ఏలూరులో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

పెదవేగి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల కార్యాలయంలో 31మంది బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.35లక్షలు చెక్కులను గురువారం ఆయన అందజేశారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. పెదపాడు మండలం వేంపాడు గ్రామానికి చెందిన మరీదు దుర్గాప్రసాద్, శాంతి దంపతుల కుమార్తె రెండేళ్ళ కీర్తన భవనంపైనుంచి తీవ్రంగా గాయపడి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సీఎం సహాయ నిధి నుంచి రూ. 2.39 లక్షలు అందించారు. నియోజకవర్గంలో పలువురికి సాయం అందజేశారు. కార్యక్రమంలో ఉప్పలపాటి శ్రీరామ్ ప్రసాద్, తాతా సత్యనారాయణ, బొప్పన సుధాకర్, నేతల రవి, ప్రభాకర్, బొడ్డేటి మోహన్‌బాబు, మాగంటి నారాయణప్రసాద్, గుత్తా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ -6 పథకాలు అమలు చేస్తాం

ఏలూరు టూటౌన్, జనవరి2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వాగ్దానం మేరకు సూపర్ -6 పథకాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి గురువారం ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఒక పక్క అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, మరోపక్క సంక్షేమ పథకాల అమలు సమర్థవంతంగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రధానంగా కొత్త పింఛన్లు, కొత్త ఇళ్ల మంజూరు చేయాలంటూ ప్రజలు వస్తున్నారన్నారు. అర్హులైన వారికి కొత్తపింఛన్లు, ఇళ్ల మంజూరు చేస్తామన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నగరంలో ప్రముఖులు, ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు ఎమ్మెల్యే చంటిని కలిసి నూతన సంవత్సర శుభకాంక్షలు తెలిపారు. ఉద్యోగ సంఘాల నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మారం హనుమంతరావు, చోడే వెంకటరత్నం, పాల్గొన్నారు.

సాగు, తాగు నీరందించడానికి చర్యలు

ఉంగుటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలకు సాగు, తాగునీరు సక్రమంగా అందించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, డ్రెయిన్స్, రెవెన్యూ అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. వ్యవసాయ, మత్స్య శాఖల అధికారులు, నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ, నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

పోలవరం జిల్లా సాధనపై వినతి

ఏలూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పోలవరాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలని పోలవరం జిల్లా సాధన సమితి ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కోరింది. సొబ్బన మోహన్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఏజన్సీ గ్రామాలన్నీ ఇతర మండలాలకు తరలిపోయాయన్నారు. పోలవరంలో వ్యాపారం, వ్యవసాయం పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారు, వ్యాపారులు ఉపాధి లేక ఇతర గ్రామాలకు వలస పోవలసిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పోలవరాన్ని ప్రత్యేక జిల్లాగా చేయడం వలన అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

పెదవేగి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాల్లో గాయపడి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు మృతి చెందారు. పెదవేగి మండలం ముండూరు గ్రామానికి చెందిన కోడూరి కార్తీక్ (18) డిసెంబరు 25న ద్విచక్రవాహనంపై వెళుతూ అదుపు తప్పి కిందపడ్డారు. విజయవాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కార్తీక్ బుధవారం రాత్రి మృతిచెందాడు. విజయరాయికి చెందిన వాకా జితేంద్రకుమార్ (59) డిసెంబరు 28న ద్విచక్రవాహనంపై ఏలూరు వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన జితేంద్ర కుమార్ విజయవాడ ఆస్పత్రిలో మృతిచెందారు. ఈ సంఘటనలపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.

దాడి సంఘటనలో ఒకరికి గాయాలు

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో కొందరు మిత్రులు మద్యం మత్తులో ఒక యువకుడిపై దాడి చేయడంతో చేయి విరిగిపోయింది. ఏలూరు శనివారపుపేటనకు చెందిన నల్లమిల్లిజోజి ఈనెల 1 తెల్లవారుజామున జోసఫ్ నగర్ వద్ద స్నేహితులతో మాట్లాడుతుండగా దుగ్గిరాలకు చెందిన గొల్లా నవీన్, గూడపాటి నాని, గూడపాటి రవి కర్రలతో దాడి చేశారు. తీవ్ర గాయాలైన జోజిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో తరలించారు. చేయి విరిగిన అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదుచేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పాఠశాలల అభివృద్ధికి కమిటీలు కృషి చేయాలి



భీమడోలులో ఎస్ఎంసీ చైర్మన్లకు సూచనలు ఇస్తున్న జడ్పీ సీఇవో సుబ్బారావు

భీమడోలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు కృషి చేయాలని జడ్పీ సీఈవో సుబ్బారావు సూచించారు. భీమడోలు హైస్కూలులో పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీలకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగ పర్చుకుంటూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని, అలాగే మధ్యాహ్న భోజన పథకాలపై కూడా పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీలు బాధ్యతగా వ్యవహరించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మావతిదేవి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

- చింతలపూడి: స్కూల్ మేనేజ్‌మెంట్‌లు ప్రతీ సోమవారం మధ్యాహ్న భోజనం, పాఠశాల పనితీరును పర్యవేక్షించి యాప్‌లో నమోదు చేయాలని ఎంఈవోలు జి.రామారావు, కిరణ్‌బాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఎస్ఎంసీ అధ్యక్షుడు, హెచ్‌ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంక్రాంతి తరువాత విద్యార్థులకు మెనూలో మార్పులు రాబోతున్నాయని, వాటిని సమీక్షించి ప్రతీ సోమవారం యాప్‌లో నమోదు చేయాలన్నారు. కమిటీలు చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై వివరించారు. ఉపాధ్యాయులు సాల్మన్‌రాజు, మోషే, పుల్లారావు శిక్షణ ఇచ్చారు. మండలంలోని 96 పాఠశాలల ఎస్ఎంసీ ఛైర్మన్‌లు, హెచ్‌ఎంలు కార్యక్రమంలో పాల్గొన్నారు.
- బుట్టాయగూడెం: ఉపాధ్యాయులు, కమిటీలు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంఈవోలు టి.బాబురావు, సీహెచ్.నరేంద్రరాయ్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పాఠశాల యాజమన్య కమిటీలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో అధికారులు మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 6 వరకు పాఠశాల కమిటీ సభ్యులకు శిక్షణలు ఇవ్వడం జరుగుతుందన్నారు. రిసోర్స్ పర్సన్లు పి.శ్రీనివాసరావు, కె.బ్రహ్మాజీ, ఎం.బాలాజీ, కె.మోహనరావు శిక్షణ నిర్వహిస్తారని తెలిపారు.
- లింగపాలెం: పాఠశాల యాజమాన్య కమిటీలు పాఠశాలల అభివృద్ధిపై దృష్టిసారించాలని ఎంఈవో కె.రామారావు అన్నారు. సింగగూడెంలో ఎస్ఎంసీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్న భోజనం, బోధన తీరును పర్యవేక్షించాలన్నారు. బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండే విధంగా చూసేలా సహకరించాలన్నారు. ఎంఈవో 2 జె.రవీంద్ర, హెచ్‌ఎంలు, కమిటీ అధ్యక్షులు, సభ్యులు, పాల్గొన్నారు.
- టి.నరసాపురం: పాఠశాల యాజమాన్య కమిటీ పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంఈవోలు టి.రామ్మూర్తి, ఎస్.కల్యాణి తెలిపారు. మండల వనరుల కేంద్రంలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు ఒకరోజు శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. కమిటీ సభ్యులు పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో, బడిబయట పిల్లలను బడిలో చేర్పించడం వంటి కార్యక్రమాలు బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్ కృష్ణారావు, ఎన్.ఆనందబాబు, టి.రామాంజిబాబు, పలువురు ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ రాజ్

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

సబ్ కలెక్టర్ స్మరణ రాజ్

లింగపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ స్మరణ రాజ్ అన్నారు. కొణిజర్లలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన గ్రామస్తుల నుంచి భూసమస్యలపై అర్జీలను స్వీకరించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సు సరైన వేదిక అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీముల్లాషా, డీటీ నాగబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- ఏలూరు రూరల్: గ్రామంలో ఆక్రమణలు తొలగించాలని అధికారులకు పలువురు వినతిపత్రాలు అందజేశారు. కొకిరాయలంకలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో చేపల చెరువులు, భూ ఆక్రమణలపై ఫిర్యాదులు అందాయి. తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.
- చింతలపూడి: యర్రంపల్లి, తాలర్లపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి తహసీల్దార్ ప్రమద్వర ఫిర్యాదులు స్వీకరించారు. జె.చెన్నకేశవరెడ్డి, జె.ముత్తారెడ్డి పాల్గొన్నారు.
- కామవరపుకోట: తడికలపూడి గ్రామ సచివాలయ ప్రాంగణంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ గెడ్డం ఎలీషా వినతిపత్రాలు స్వీకరించారు. ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వోలు మాదు లక్ష్మీనారాయణ, బి.రమేష్, వెంకన్నబాబు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.
- టి.నరసాపురం: రాజుపోతేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సాయిబాబా మాట్లాడుతూ మండలంలో 225 సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. నల్లూరి వెంకట చలపతిరావు, రీసర్వే డీటీ స్రవంతి, హరిబాబు, వీఆర్వో ప్రసాద్, బొంతు సత్యనారాయణ, నల్లూరి శ్రీరామమూర్తి, దావులూరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు టూటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వృత్తిదారులకు నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో వివిధ రంగాల వారికి శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు రేషన్, ఆధార్‌కార్డులు బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లు జత చేయాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 8074683589, 9949623255ను సంప్రదించాలన్నారు.

బాల సదనంలో చిన్నారులకు దుప్పట్ల పంపిణీ

దెందులూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనంలో చిన్నారులకు జై గౌడ సేన సంఘం జిల్లా అధ్యక్షుడు నూతి రవీంద్రగౌడ్ దుప్పట్లు పంపిణీ చేశారు. బాలసదనం సూపరిటెండెంట్ బేబి సరోజిని, కార్యాలయ ఉద్యోగి దుర్గామల్లేశ్వరితో పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. అనంతరం చిన్నారులు గోపిక, సిరి పుట్టినరోజు వేడుక నిర్వహించారు.

బాధితుడికి చోరీ సొత్తు అందజేత

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దొంగను అరెస్టు చేసి అతడి నుంచి చోరీ సొత్తు రికవరీ చేసి ఆ సొత్తును కోర్టు అనుమతి తీసుకుని బాధితుడికి ఎస్పీ కేపీఎస్ కిశోర్ స్వయంగా అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లికి చెందిన నందమూరి సత్యనారాయణ గత నవంబరు 25న భీమడోలు గాంధీబొమ్మ సెంటర్‌లో యూనియన్ బ్యాంక్ నుంచి రూ.2.5 లక్షలు తీసుకున్నాడు. నగదు పాలిథిన్ కవర్‌లో పెట్టి స్కూటీ డిక్కీలో ఉంచారు. భీమడోలు జంక్షన్‌లో కొన్ని వస్తువులు కొనుగోలు చేసుకుని స్కూటీ డిక్కీని తెరచి చూడగా నగదు కనిపించలేదు. భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈనేరానికి పాల్పడిన గుండుగొలనుకు చెందిన చొప్పా రావు (50)ని అరెస్టు చేశారు. చోరీ సొత్తును రికవరీ చేసి కోర్టు అనుమతితో బాధితుడు అయిన సత్యనారాయణకు జిల్లా ఎస్పీ అందించారు.



ఆర్టీసీ జోనల్ చైర్మన్‌ను అభినందిస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నేతలు

ఆర్టీసీ జోనల్ చైర్మన్‌ను కలిసిన యూనియన్ నేతలు

ఏలూరు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ జోనల్ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడును ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు గురువారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు, డిప్యూటీ జనరల్ సెక్రటరి ఎండీ ప్రసాద్, జోనల్ అధ్యక్షుడు ఎంఎస్.రావు, కార్యదర్శి వై.శ్రీనివాసరావు, బి.కేదారేశ్వరరావు, ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహోన్నత వ్యక్తి మన్మోహన్‌సింగ్

ఏలూరు కార్పొరేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మహోన్నత వ్యక్తి అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు అన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం మన్మోహన్‌సింగ్ సంతాప సభ నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారని, జాతీయ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం తీసుకువచ్చారని తెలిపారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు అన్నారు. గౌడు రంగబాబు, దండుబోయిన చంద్రశేఖర్, చెక్కా గుప్తా, లంక రామ్మోహన్, ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, సాదే బాబూప్రసాద్, సత్యనారాయణ, కొమ్మన సాంబశివరావు, వేల్పుల వెంకటేశ్వరరావు, రంభ కిశోర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటికి తాళం వేసి ఊరెళితే.. దొంగలు దోచేశారు

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లి వచ్చేసరికి దొంగలు తాళాలు పగులగొట్టి 9 కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. వట్లూరుకు చెందిన ఘంట వీర వెంకట సత్యసాయి వర ప్రసాద్ ఈనెల 1న ఉదయం ఇంటికి తాళాలు వేసి అత్తగారి ఊరు ముదినేపల్లి వెళ్లారు. కుటుంబ సభ్యులను తీసుకుని గురువారం ఉదయం వచ్చేటప్పటికి తాళాలు, ఇంట్లో బీరువా పగులగొట్టి ఉన్నాయి. 9 కాసుల బంగారు అభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి ఏలూరు త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు సంక్రాంతి ఆటల పోటీలు

కుక్కునూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండవ రామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతికి యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా నాయకులు వై.నాగేంద్రరావు గురువారం తెలిపారు. డివిజన్‌స్థాయి వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, షెటిల్, మండల స్థాయిలో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 8897909610నెంబర్‌ను రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

లింగపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిసరాల శుభ్రతతో పాటు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణకిశోర్ అన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు వైద్యసిబ్బంది సేవలందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దొంగనోట్ల ముఠా అరెస్టు

రూ.2.5 లక్షల అసలు నోట్లు

రూ.15 లక్షల నకిలీ నోట్లు స్వాధీనం



నకిలీనోట్లు పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : అసలు నోట్లకు దొంగ నోట్లు అధిక మొత్తంలో ఇస్తామని మోసగిస్తున్న ఒక ముఠాను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకాతిరుమల ఎస్‌ఐ పి.సుధీర్ వారి సిబ్బంది కలిసి ముఠాలోని ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు పరీరాలో ఉన్నాడు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. ద్వారకాతిరుమలలో ఒక వ్యక్తివద్ద నుంచి రెండున్నర లక్షల అసలు నోట్లను తీసుకుని 15 లక్షల దొంగ నోట్లను ఒక ముఠా మార్చుకుంటుందని సమా చారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురం గ్రామా నికి చెందిన కోడూరి రవి తేజ (28) ప్రస్తుతం జంగారెడ్డిగూడెంలో ఉంటూ దొంగ నోట్ల మార్పి డి ముఠాను తయారు చేశాడు. జంగారెడ్డి గూడెం పద్మాథియేటర్ సమీపంలో నివాసం ఉంటున్న షేక్ నాగూర్‌మీరావలి (25) జంగా రెడ్డి గూడెం మసీదు సెంటర్‌కు చెందిన వీరంకి రాజేశ్ (28)లతో రవితేజ ముఠా ఏర్పాటు చేసు కున్నారు. నాగూర్‌మీరావలి, వీరంకి రాజేష్‌లు 15 లక్షల రూపాయల నకిలీ నోట్లను తీసుకుని గురువారం ద్వారకాతిరుమలలో రోడ్డుపక్కన హోటల్ నడుపుకుంటూ జీవించే కొల్లు సుబ్ర హ్మణ్యం అలియాస్ సుబాష్ (40) వద్దకు వెళ్ళి డబ్బులు మార్పిడి చేస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఈ ముగ్గురిని అరెస్టు చేశారు. వీరి నుంచి అసలైన నోట్లు రెండున్నర లక్షల రూపాయలు, నకిలీ నోట్లు (500రూపాయలు) 15 లక్షల రూపాయలు, ఒక మోటారు సైకిల్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కోడూరి రవితేజ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టారు.

అర్హత సాధించిన 211 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు



అభ్యర్థుల పరుగు పందెం పరిశీలిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కానిస్టేబుళ్ళ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గత నెల 30వ తేదీ నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న 204 పోస్టుల భర్తీకి రాష్ట్ర పోలీసుల రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన 4976 మంది అభ్యర్థులు అర్హత సాధించగా వీరిలో పురుష అభ్య ర్థులు 3997 మంది కాగా, మహిళా అభ్యర్థి నులు 979 మంది ఉన్నారు. గురువారం 600 మంది అభ్యర్థులకుగాను 346 మంది హాజరయ్యారు. వీరిలో 211 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. పోలీస్ కానిస్టేబుళ్ళ రిక్రూట్‌మెంట్‌లో భాగ ంగా ప్రిలిమనరీ పరీక్షల్లో అర్హత సాధించిన 979 మంది మహిళా అభ్యర్థినులకు ఈనెల 3, 4 తేదీలలో ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ ఈవెంట్స్‌ను నిర్వహించనున్నారు. ప్రత్యే కంగా మహిళా అధికారులతో ఈ పోటీ పరీక్ష లను నిర్వహించడానికి జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాలు జారీ చేశారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతికి ప్రయాణికుల రద్దీని పురస్కరి ంచుకుని దక్షిణమధ్య రైల్వే అధికారులు ఏలూరు మీదుగా ఆరు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. కాచిగూడ నుంచి కాకినాడ టౌన్‌కు వెళ్ళే రైలు (07653) కాచిగూడలో గురువారం, శుక్రవా రాల్లో బయలుదేరుతుంది. కాకినాడ టౌన్ నుంచి కాచిగూడ వెళ్ళే రైలు (07654) కాకినాడలో శనివారం, సోమవారం బయలు దేరుతుంది. ఈ రైళ్లు కాచిగూడ, మల్కాజ్‌గిరి, చెర్లపల్లి, నల్గొండ, మిర్యాల గూడ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయ వాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, కాకినా డలలో ఆగనుంది. రైల్ నెంబర్ 07023 హైద రాబాద్ నుంచి కాకినాడ టౌన్‌కు శుక్రవారం వెళ్తుంది. రైల్‌నెంబర్ 07024 కాకినాడ టౌన్ నుంచి హైదరాబాద్‌కు శనివారం కాకినాడలో బయలు దేరుతుంది. ఈరెండు రైళ్లు హైదరాబాద్, సికింద్రాబాద్ జంక్షన్, పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుం టూరు జంక్షన్, కృష్ణాకెనాల్, విజయవాడ జం క్షన్, గుడివాడ జంక్షన్, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజ మండ్రి, అనపర్తి, సామర్లకోట జంక్షన్, కాకినాడ టౌన్ స్టేషన్లలో ఆగనున్నాయి.

హైదరాబాద్‌కు వెళ్లే వాహనాల దారి మళ్లింపు

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : హైందవ శంఖారావం మహాసభ ఈనెల 5వ తేదీన కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో జరుగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్ళింపుకు పోలీసులు నిబంధనలు విధించారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్ళే వాహనాలు భీమడోలు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, చింతలపూడి, ఖమ్మం మీదుగా హైదరాబాద్‌వైపు వెళ్ళాలన్నారు. ఏలూరు బైపాస్, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట, ఖమ్మం మీదుగా కూడా హైదరాబాద్ వెళ్ళవచ్చన్నారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సరిగా చదవడంలేదని తల్లిదండ్రులు మందలిం చడంతో విద్యార్థి మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరులో ని మంచినీళ్ళతోటకు చెందిన కటకం దుర్గా ప్రసాద్, దేవి దంపతులు వస్త్రాల దుకాణాల్లో పనిచేస్తున్నారు. వారి పెద్ద కుమారుడు దుర్గా ప్రమోద్‌కుమార్ మైలవరంలో బీటెక్ చదువు తున్నాడు. చిన్న కుమారుడైన షణ్ముఖ ప్రవీణ్ (13) అశోక్‌నగర్ అమలోద్భవి స్కూలులో 9వ తరగతి చదువుతున్నాడు. అతని సోదరుడు ప్రమోద్‌కుమార్ వెళ్లిపోయినప్పటి నుంచి ఒం టరిగా ఉంటూ సరిగా చదవలేకపోతున్నాడు. దీంతో తల్లిదండ్రులు అతడిని మందలించారు. గతనెల 31న కూడా మందలించారు. ఈనెల 1వ తేదీ రాత్రి తల్లిదండ్రులు రాత్రి ఇంటికి వచ్చేటప్పటికి ఇంట్లో ఒంటరిగా ఉన్న షణ్ముఖ ప్రవీణ్ ఉరి వేసుకుని వేలాడుతూ కనిపిం చాడు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అయోధ్యకు 6 లక్షల దీపోత్సవ వత్తులు



రామాలయంలో దీపోత్సవం వత్తులకు పూజలు

చాట్రాయి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో జరిగే కోటి దీపోత్సవానికి అపర భద్రాద్రి చనుబండ కోదండ రామాలయం నుంచి 6 లక్షల దీపోత్సవ వత్తులను పంపారు. రామాలయంలో మహిళా భక్త బృందం సభ్యులు జైశ్రీ రామ్ నామాన్ని జపిస్తూ వత్తులు తయారు చేసి నువ్వుల నూనెతో తడిపి ప్యాకింగ్ చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులు, రాజమహేంద్రవరం కృష్ణ చైతన్య సంఘం అధ్యక్షులు కల్యాణ అప్పారావు భక్తులు వత్తులను స్వామి వారి ముందు ఉంచి పూజలు చేసి అయోధ్యకు పంపారు. అలాగే శ్రీసీతా రాముల కల్యాణానికి శ్రీ కృష్ణ చైతన్య సంఘం వానర సేనతో వ్యవసాయ చేసి పండించిన ధాన్యాన్ని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి గోటితో వలిచి తలంబ్రాలు తయారు చేయటం కోసం భక్తులకు అందజేశారు. ఈ విధంగా తయారు చేసిన స్వామి వారి తలంబ్రాలను అయోధ్య, భద్రాచలం, చనుబండలలో జరిగే శ్రీసీతారామ కల్యాణంలో వినియోగిస్తామని అప్పారావు చెప్పారు.

అక్షరాస్యత పెంచేలా వీవోలు కృషిచేయాలి

నూజివీడు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నూరుశాతం అక్షరాస్యత సాధించేలా వెలుగు గ్రామీణ సంఘాలు కృషి చేయాలని నూజివీడు ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్ అన్నారు. నూజివీడు ఎంపీడీవో కార్యాలయంలో ఆయన గ్రామ సమాఖ్య సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాశ్యత పెంచాలని ఆయన సూచించారు. అనంతరం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశమై సీసీ రోడ్లనిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని అన్నారు.

రహదారుల పరిశీలన

మర్రిబంధం, మీర్జాపురం గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న సీసీ రహదారులను ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్ గురువారం పరిశీలించారు. అనంతరం గ్రామంలోని డప్పుకళాకారులు పింఛన్లు ఇవ్వాల్సిందిగా ఆయన దృష్టికి తీసుకురాగా పంచాయతీ సెక్రటరీలు డప్పుకళాకారుల నుంచి అర్జీలు స్వీకరించి చర్యలు చేపట్టాలని సూచించారు.

గ్రామాల్లో పడకేసిన తాగునీటి పథకాలు

» ఐదేళ్లుగా మరమ్మతుల ఊసేలేదు.. » పనిచేయని ఫిల్టర్‌బెడ్స్



కలిదిండి మండలం మూలలంకలో ఫిల్టర్‌బెడ్స్‌లో మొక్కలు మొలచిన దృశ్యం

కైకలూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో ప్రజలకు తాగేందుకు గుక్కెడు నీరు లేక అల్లాడుతున్నారు. గ్రామాలకు నిధులు కేటాయించకపోవడంతో రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ భారం మోయలేక వాటిని గాలికొదిలేశారు. అనేక గ్రామాల్లో చెరువుల్లో నీరు నేరుగా పైపులైన్ల ద్వారా ఇళ్ళకు అందిస్తున్నారు. సుమారు 40 ఏళ్ల క్రితం అప్పటి జనాభా ప్రాతిపాదికన రక్షిత మంచినీటి పథకాలు నిర్మాణం జరిగాయి. కాలానికి అనుగుణంగా జనాభా పెరుగుతున్నా చెరువుల సామర్థ్యం, పథకాల సామర్థ్యం పెరగకపోవడంతో ప్రజలు అవస్థలను ఎదుర్కొంటున్నారు. నిర్వహణ సరిగా లేక ఎక్కడికక్కడ గ్రామాల్లో ఫిల్టర్‌బెడ్లు పనిచేయకపోవడంతో వాటిలో గడ్డి, కిక్కిస, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కైకలూరు నియోజకవర్గంలో 110 గ్రామాలు ఉండగా సగం గ్రామాల్లో పథకాలు పనిచేయని స్థితిలో ఉన్నాయి. ప్రజలు గ్రామాల్లోనే ప్రైవేటు ఆర్వో సిస్టమ్‌లను ఆశ్రయిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కనీస అవసరాలకు అనుగుణంగా నీరు సరఫరా కావడం లేదు. కలిదిండి మండలం మూలల్లంక, భాస్కరరావుపేట గ్రామాలకు ఒకటే రక్షిత మంచినీటి పథకం నుంచి నీరు సరఫరా అవుతోంది. ఫిల్టర్‌బెడ్స్ పనిచేయకపోవడం, చెరువుల సామరథ్యం మేరకు నీరు లేకపోవడంతో రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తున్నా రు. శీతాకాలంలోనే ఈ దుస్థితి ఉందంటే ఇక రానున్న వేసవిలో తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తు న్నారు.

కైకలూరు మండలంలో మేజర్ పంచాయతీ అయిన ఆటపాకలో సుమారు ఎనిమిది వేల మంది జనాభా నివశిస్తున్నారు. ఏడెకరాల మంచినీటి చెరువు ఉండడంతో మార్చి నుంచి రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తుంటారు. రక్షిత మంచినీటి పథకానికి చెందిన ఫిల్టర్‌బెడ్స్ ఏడాదిగా పని చేయక పోవడంతో నేరుగా చెరువులోని నీటినే సరఫరా చేస్తున్నారు. కొంతమంది ప్రజలు కాచి చల్లా ర్చిన నీటిని తాగుతుండగా మరికొంత మంది ఆర్వో ప్లాంట్‌లను ఆశ్రయిస్తున్నారు. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులో నాలుగు వేల మంది జనాభా ఉన్నారు. నాంది ఫౌండేషన్ ద్వారా ఆర్వో సిస్టమ్‌ను ప్రారంభించి పంచాయతీకి అప్పగించగా దాని నిర్వహణ సక్రమంగా లేక ఐదేళ్లుగా మరుగున పడింది. మండవల్లి మండలం పెనుమాకలంకలో రక్షితమంచినీటి పథకానికి చెందిన ఓవర్‌హెడ్‌ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. దీనితో ఓవర్ హెడ్‌ట్యాంక్‌ను నీటితో నింపేందుకు పంచాయతీ సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల ట్యాంక్ నాణ్యతను ప్రత్యేక నిపుణుల బృందం వచ్చి పరిశీలించింది. ఆ నివేదిక రాకపోవడంతో ప్రస్తుతం గ్రామంలోని ప్రజలు నీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇలా అనేక గ్రామాల్లో ఫిల్టర్‌బెడ్స్ పనిచేయకపోవడంతో చెరువుల నుంచి నేరుగా గృహాలకు నీటి సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా మంచి నీటి చెరువుల దుస్థితిని గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుకుంటున్నారు.

డైరీ,క్యాలెండర్ ఆవిష్కరణ

ముదినేపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ డైరీ,2025 క్యాలెండర్‌ను గురువారం ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ ముదినేపల్లిలో ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, మండల శాఖ అధ్యక్షుడు ఎ.కృపాకర్, ప్రధాన కార్యదర్శి డి.వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.



కొండంగి - మట్టగుంట రోడ్డుకు జరుగుతున్న మరమ్మతులు

తీరనున్న రహదారి కష్టాలు

కలిదిండి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కొండంగి - మట్టగుంట రహదారి మరమ్మతులను రూ.60 లక్షలతో ప్రారంభించారు. రహదారిపై ఉన్న గుంతలను కంకరతో తారు వేస్తున్నారు. రూ.కోటి 20 లక్షలతో చేపట్టిన మల్లంపూడి - మట్టగుంట రోడ్డు మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి. సంక్రాంతి కల్లా పనులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈఈ అరవింద్ తెలిపారు.

ఎస్ఎంసీ, ఉపాధ్యాయులకు శిక్షణ

ముసునూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు భాగస్వాములు కావాలని మండల విద్యాశాఖాధికారి బి.వి.యస్ సుబ్బారావు కోరారు. బుధవారం ముసునూరులో మండల వ్యాప్తంగా ఉన్న 62 పాఠశాలల ఏస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఏస్ఎంసీ సభ్యులు పాఠశాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలన్నారు.

విద్యార్థులకు బహుమతులు

ముసునూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆముదాల తిరుపతయ్య, మేరీ రత్నావళి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణక్కపేట జడ్పీ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమం హెచ్‌ఎం రామకృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఈ విద్యా సంవత్సరంలో ప్రథమ, ద్వితీయ శ్రేణి సాధించిన విద్యార్థులకు నగదును ట్రస్ట్ చైర్మన్ ఆముదాల కాంతారావు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావ్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు చలసాని వెంకట రామారావు, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయదారుడి అరెస్ట్

ముసునూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అనగాని రాంబాబు అనే వ్యక్తి సారా, అక్రమ మద్యం అమ్మకాలు చేస్తున్నాడని వచ్చిన ఫిర్యాదు మేరకు అతని ఇంటిపై దాడి చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ ఏ.మస్తానయ్య తెలిపారు. ఈ దాడిలో 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, నిందితుడు రాంబాబును అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చామన్నారు.

హైందవ శంఖారావంపై ప్రచారం

చాట్రాయి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభకు తరలిరావాలని కోరుతూ గురువారం మండలంలో బీజేపీ నాయకులు బజ్జూరి గోపి కృష్ణ, నెక్కలపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ప్రజలను కలిసి హైందవ శంఖారావం సభ ఉద్దేశాన్ని వివరించి సభకు రావాలని కోరుతున్నారు.

పాఠశాలల కమిటీలకు శిక్షణ

చాట్రాయి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గత ఆగస్టులో ఎన్నికైన పాఠశాలల యాజమాన్య కమిటీలకు గురువారం చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో శిక్షణ కార్యక్రమం జరిగింది. కమిటీల విధులు, బాధ్యతలు, సమావేశాల నిర్వహణ, పాఠశాలల అభివృద్ధిలో కమిటీల పాత్ర మొదలైన అంశాలపై ఎంఈవో బ్రహ్మాచారి, రిసోర్స్ పర్సన్స్ ఏవీ వెంకటేశ్వరరావు, జయరాజు, శ్రీనివాసరెడ్డి శిక్షణ ఇచ్చారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగించుకోండి



సింగరాయపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ముదినేపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల లక్ష్యాలు, ప్రాధాన్యతను రైతులు తెలుసుకుని సద్వినియోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస్ తెలిపారు. సింగరాయ పాలెంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ సదస్సులను సద్వినియోగించుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గ్రామంలో బావాజీ మఠానికి చెందిన ఎకరం 33 సెంట్ల స్థలంలో తాము పదేళ్ల నుంచి నివాసం ఉంటున్నామని, తమను అక్కడి నుంచి ఖాళీ చేయించే ప్రయత్నాలు విరమించుకోవాలని పలువురు అర్జీలు అందజేశారు. జాయింట్ ఎల్‌పీఎంల వల్ల ధాన్యం అమ్మకాలకు ఇబ్బందికరంగా ఉందని రైతు చేబోయిన రాధాకృష్ణ అర్జీ అందజేశాడు. రీ సర్వే డీటీ శ్రీనివాస ప్రసాద్, సర్పంచ్ బోయిన విమల, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శి నాగలక్ష్మి, వీఆర్వో రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ కోరుతూ మూడు అర్జీలు

మండవల్లి : రైతులందరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగించుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాల్ పేర్కొన్నారు. చింతలపూడి, లేళ్ళపూడిల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. సబ్ డివిజన్ కోరుతూ చింతలపూడిలో ఒకటి, లేళ్లపూడిలో రెండు అర్జీలు వచ్చినట్లు ఆర్‌ఐ శ్రావణి తెలిపారు. సర్పంచ్, వీఆర్వో, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎంసీ చైర్మన్లకు శిక్షణ

ముదినేపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల యాజమాన్య కమిటీల చైర్మన్లు, సభ్యులు, ప్రధానోపాధ్యాయులకు గురువారం స్థానిక ఎంఆర్సీ సెంటర్‌లో శిక్షణ నిర్వహించారు. ఎంఈవో కె.నరేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించిన ఉపాధ్యాయులు ఎస్.చంద్రశేఖర్, మస్తాన్, యశోద కృష్ణ పాఠశాలల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.



జోగిరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

ఘనంగా జోగిరాజు పుట్టిన రోజు వేడుకలు

కలిదిండి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు పుట్టిన రోజు వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బర్త్ డే కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జోగిరాజు అన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ రమాదేవి, కలిదిండి డీసీ చైర్మన్ ముద్దం బోగేశ్వరరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి చక్రవర్తి, నాగబాబు, బోసు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముదినేపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం రాత్రి ఎస్‌ఐ వీరభద్రరావు సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.24 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

సంతాపం

ముదినేపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ పరిపాలనా అధికారిగా, ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా గతంలో సేవలందించిన గుంజా మాధవరావు మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కృష్ణా జిల్లా పెదపారుపూడి మండల పరిషత్ కార్యాలయ ఏవోగా విధులు నిర్వహిస్తున్న ఆయన బుధవారం తిరుపతి నుంచి గుడివాడ రైలులో వస్తుండగా, కావలి వద్ద గుండెపోటుతో మరణించారు. ఆయన మృతి పట్ల ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్య నారాయణ, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, ఎంపీడీవో రామకృష్ణ, ఏవో రమణరావు, ఈవోపీఆర్డీ అశోక్, కార్యాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

లక్ష తులసీ పూజ

ముదినేపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం ముదినేపల్లిలోని సీతారామస్వామి దేవస్థానంలో వార్షిక లక్ష తులసీ పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు అభిషేకాలు జరిపారు.

ఫోన్ పోయింది... అకౌంట్‌లో రూ.99 వేలు కొట్టేశారు..



బాధితుడు పాపిరెడ్డి,

చాట్రాయి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కిరాణా షాపుకు వెళితే అక్కడ ఫోన్ పోయింది. కొద్దిసేపటిలోనే అకౌంట్‌లో ఉన్న రూ.99 వేలు కొట్టేసిన సంఘటన ఆలస్యంగా తెలిసింది. ఈ సంఘటన డిసెంబరు 30వ తేదీన జరగ్గా వెంటనే బాధితుడు చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం చాట్రాయిలో కెఎంఆర్ ఇరిగేషన్ షాపు యజమాని కుప్పిరెడ్డి పాపిరెడ్డి డిసెంబరు 30వ తేదీ ఉదయం కిరాణా షాపుకు సరుకుల కోసం వెళ్ళగా ఫోన్ పోయింది. అదే రోజు పాపిరెడ్డి బ్యాంకు వెళ్ళి ఆరా తీయగా అకౌంట్‌లో రూ.99 వేలు ఒడిస్సాలోని రెండు అకౌంట్లకు ఫోన్‌పే ద్వారా బదిలీ అయినట్లు తెలుసుకొని అవాక్కయ్యాడు. ఫోన్ ఉదయం 8 గంటలకు పోతే, 8.37 నుంచి 9.35 మధ్యలో రూ.50 వేలు, రూ.20 వేలు, రూ.7 వేలు, రూ.22 వేలు కేటుగాళ్ళు డబ్బు లాగేశారు. నారాయణ మోహంతి, అబ్దుల్ మజీద్ ఖాన్ అకౌంట్లకు డబ్బు బదిలీ అయినట్లు గుర్తించారు. యూపీ ఐ పిన్ నెంబరు లేకుండా కేటుగాళ్ళు టెక్నాలజీని ఉపయోగించి డబ్బు ఎలా కొట్టేశారో తెలియటం లేదని బాధితుడు అంటున్నారు. పాపిరెడ్డి వెంట ఫాలో అయ్యి ఆయన ఆదమరుపుగా ఉన్నప్పుడు ఫోన్ దొంగిలించి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎస్సై రామకృష్ణను వివరణ కోరగా బాధితుడు ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నామని అన్నారు.

పథకం ప్రకారం ఇరికిస్తున్నారు: ప్రభావతి



చికిత్స పొందుతున్న ప్రభావతి

నూజివీడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి):పథకం ప్రకారం తనపై కక్ష సాధిస్తూ కేసుల్లో ఇరికిస్తున్నారని, యూనియన్ బ్యాంకులో పని చేస్తూ సస్పెండ్ అయిన దావులూరి ప్రభావతి ఆరోపించారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె మాట్లాడుతూ తాను గంగూరు యూనియన్ బ్యాంకు మేనేజరుగా పని చేస్తున్నప్పటి నుంచి సీతారాంపురానికి చెందిన వైసీపీ నాయకుడు కవులూరి యోగేంద్ర తనను టార్గెట్ చేసి అసత్య ఆరోపణలు చేస్తూ పథకం ప్రకారం కేసుల్లో ఇరికిస్తున్నాడన్నారు. ఇదే కోవలో జనసేన నాయకుడిగా చెప్పుకునే వెంకట్రావు బుధవారం తన ఇంటి సమీపానికి వచ్చి అసభ్య పదజాలంతో దూషించడంతో తన తండ్రి, సోదరుడు ఆయనను పడదోశారన్నారు. ఆ సమయంలో పెనుగులాట జరగ్గా, అసభ్యంగా ప్రవర్తించడంతోనే వెంకట్రావుపై చేయి చేసుకున్నానన్నారు. ఆపై వెంకట్రావును పోలీసులకు అప్పగించింది తానేనన్నారు. అయితే ఈ ఘటన సైతం ఒక పథకం ప్రకారమే జరిగిందనేందుకు వీడియో తీయటమే ఉదాహరణ అన్నారు. వెంకట్రావు వ్యవహరించిన తీరు ఎలా ఉందనేది తన ఇంటి సీసీ ఫుటేజ్‌ల్లో ఉందని, నిజానిజాలు పరిశీలించి తనకు, తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె కోరారు. తనపై నూజివీడు, ఇతర ప్రాంతాల్లో పెట్టిన కేసులన్నీ నిరాధారమైనవని, ఎవరో తనకు తెలియని వారితో తనపై కేసులు బనాయించటం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అధికార పార్టీ అండ చూసుకుని యోగి తనపై అక్రమ కేసులు బనాయించగా, అవి ఇప్పటికి కొనసాగించటం శోచనీయమన్నారు.

ఇరుపక్షాలపై కేసులు

నూజివీడు మండలం మర్రిబంధం గ్రామంలో జనసేన నాయకుడు వెంకట్రావు, బ్యాంకు ఉద్యోగిని దావులూరి ప్రభావతిల విషయంలో ఇరుపక్షాలపై కేసులు నమోదు చేసినట్లు నూజివీడు రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు తెలిపారు.

సీఎంను కలిసిన చాట్రాయి నాయకులు

చాట్రాయి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును బుధవారం మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో చాట్రాయి మండలానికి చెందిన జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు పానుగళ్ళ కోటేశ్వరరావు కలిశారు. మండలానికి సంబంధించిన పలు సమస్యలు సీఎంకు వివరించినట్లు చెప్పారు.

రహదారులకు మరమ్మతులు

నూజివీడు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలోని ఎంఅండ్‌కె రహదారిలో పూర్తిగా ధ్వంసమైన ప్రాంతాన్ని తొలగించే ప్రక్రియ ప్రస్తుతం సాగుతుండగా 32వ వార్డులో జేసీబీతో రహదారిని తొలగించి మరమ్మతులు చేపట్టే కార్యక్రమం కొనసాగుతోంది.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

నూజివీడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బాకీ తీర్మాన నిమిత్తం చెల్లనిచెక్కు ఇచ్చిన కేసులో ఒకరికి ఆరు నెలలు జైలుశిక్ష విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ గురువారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే బాపులపాడు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన దారా రామకిషోర్ 2021, ఏప్రిల్ 4న ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన షేక్ చాందినికి రూ.3లక్షల నగదును అప్పుగా ఇచ్చాడు. కొంతకాలం తరువాత బాకీ చెల్లించమని రామ కిషోర్ కోరగా, చాందిని రూ.3లక్షలకు చెక్కు ఇచ్చింది. చెక్కును బ్యాంకులో వేయగా చాందిని అకౌంట్లో నగదు లేదని, ఆ చెక్కును తిప్పి పంపడంతో రామ్‌కిషోర్ కోర్టును ఆశ్రయించాడు. కేసును విచారించిన అనంతరం నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ చాందినికి జరిమానా, ఆరునెలలు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

11 నుంచి ట్రిపుల్‌ఐటీకి సెలవులు

నూజివీడు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):సంక్రాంతిని పురస్కరించుకుని జనవరి 11 నుంచి 19వరకు రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల నాలుగు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లకు సెలవులు ప్రకటిస్తున్నట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఆయన మాట్లాడుతూ రెండో సెమిస్టర్‌కు సంబంధించి మొదటి మిడ్ పరీక్షలు జనవరి 7,8,9 తేదీల్లో నిర్వహిస్తామని, అనంతరం 11వ తేదీ నుంచి 19 వరకు సెలవులు ఇస్తున్నట్లు తెలిపారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

చాట్రాయి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ రికగ్నైజుడ్ టీచర్స్ యూనియన్ ప్రచురించిన 2025 డైరీ, క్యాలెండర్, స్టిక్కర్స్, టేబుల్ క్యాలెండర్‌ను మండల రిసోర్స్ సెంటర్‌లో గురువారం ఎంఈవో బ్రహ్మాచారి ఆవిష్కరించారు.